ఆంధ్రజ్యోతి

5



ANDHRAJYOTHY

చిత్తూరు

జిల్లా వార్తలు

శుక్రవారం 24 మే 2024

ఆంధ్రజ్యోతి పాఠకులకు గమనిక

ఆంధ్రజ్యోతి కొత్త చందాదారులుగా చేరదలచుకున్న వారు అలాగే ప్రస్తుత చందాదారులకు పేపరు పంపిణీ విషయంలో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఈ క్రింది ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.

తిరుపతి, చంద్రగిరి, రేణిగుంట	: 99854 38368
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు	: 99854 10940
పలమనేరు, కుప్పం, పుంగనూరు	: 97036 18724
మదనపల్లి, పీలేరు, తంబళ్లపల్లి	: 99854 22298
శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి, సత్యవేడు	: 99890 59755

ఓటెత్తిన పల్లెలు



- ఉవ్వెత్తున ఎగసిన జన చైతన్యం
- అత్యధిక కేంద్రాల్లో 95శాతంపైనే ఓటింగ్
- పలమనేరు, కుప్పం నియోజకవర్గాల్లో అధికం
- వంద శాతం పోలింగ్‌తో కీలపట్టు దళితవాడ ఆదర్శం

పల్లెల్లో ఓటు చైతన్యం పెరిగింది. 'నా ఓటు.. నా హక్కు' అని ఓటర్లు భావించారు. ఆ హక్కును వినియోగించు కోవడానికి పోలింగ్ రోజున పోటెత్తారు. గంటలకొద్దీ ఆలస్యమైనా క్యూలలో నిలబడ్డారు. కొన్ని పోలింగ్ కేంద్రాల్లో తెల్లవారు జాము వరకూ నిరీక్షించి.. ఓటేశారు. అందుకే అత్యధిక పోలింగ్ కేంద్రాల్లో 95 శాతానికిపైగా ఓటింగ్ నమోదైంది.

సమర్థులు ఇంట్లో ఉంటే అసమర్థులు రాజ్యమేలుతారని ఓ సినీ పాటల రచయిత అన్న మాటల్ని జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల ప్రజలు తమకు అన్వయించుకున్నారు. తమను ఎవరు పరిపాలించాలో.. ఐదేళ్లకోసారి ఓటు ద్వారా ఎన్నుకునే సదవకాశాన్ని కాదనుకుంటే ఏం జరుగుతుందో గ్రహించారు. కాబట్టే ఈసారి కనీవినీ ఎరుగని రీతిలో పోలింగ్ శాతం నమోదైంది. విదేశాలు, ఇతర రాష్ట్రాల్లో స్థిర పడిన వాళ్లు సొంత గ్రామాలకు వచ్చి ఓటేశారు. ఇక, గ్రామీణ ఓటర్లలోనూ ఓటుపై అవగాహన పెరిగింది. యువత, మహిళలు, వృద్ధులు.. ఇలా అన్ని వయసులు, వర్గాల ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు భారీగా తరలివచ్చారు. దీంతో ఆయా గ్రామాల్లో 95శాతానికి మించి పోలింగ్ నమోదైంది. ఇలా 95 శాతం పోలింగ్ దాటిన కేంద్రాలు.. కుప్పం, పలమనేరు నియోజకవర్గాల్లో అధికంగా ఉన్నాయి. నగరి మండలంలోని కీలపట్టు దళితవాడలో ఏకంగా వంద శాతం పోలింగ్ నమోదైంది. పుంగనూరు, జీడీనెల్లూరు నియోజకవర్గాల్లో అలాంటి కేంద్రాలు తక్కువగా ఉన్నాయి. చిత్తూరు పట్టణంలో 95 శాతం దాటిన పోలింగ్ కేంద్రం ఒక్కటీ లేదు. చిత్తూరు రూరల్‌లో మాత్రం ఒకటుంది. 2019లో అత్యధిక ఓటింగ్ అనుకుంటే ఈసారి పోలింగ్ అంతకు మించింది. జిల్లాలో 95శాతానికి మించి పోలింగ్ నమోదైన కేంద్రాల వివరాలను పరిశీలిస్తే..

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి

పలమనేరు నియోజకవర్గం

పలమనేరు నియోజకవర్గంలోని 19 కేంద్రాల్లో 95శాతానికి మించి పోలింగ్ నమోదైంది. గంగవరంలో 8, పలమనేరులో 5, బైరెడ్డిపల్లెలో 4, వి.కోట, పెద్దపంజాణిలో ఒక్కోటి చొప్పున అత్యధికంగా పోలింగ్ నమోదైన కేంద్రాలున్నాయి.

- పలమనేరు మండలంలోని శ్రీరంగరాజపురం కేంద్రంలో 639 మందికి 617 మంది (96%) ఓట్లేశారు. జగమర్లలో 541 మంది ఓటర్లకు 521 మంది (96%) ఓటు హక్కును వినియోగించుకున్నారు. కండమడుగులో 475కి 456 మంది (96%).. నలగాంపల్లెలో 949కి 906 మంది (95%).. చెత్తపెంటలో 554 మందికి 542 మంది (97%) మంది ఓట్లేసి ఆదర్శంగా నిలిచారు.
- బైరెడ్డిపల్లె మండలంలోని రామాపురం కేంద్రంలో 619కి 592 ఓట్లు (95%).. లక్కనపల్లెలో 904కి 862 ఓట్లు (95%).. బైరెడ్డిపల్లె కేంద్రంలో 1168 ఓటర్లకు 1122 మంది (96%).. చప్పిడిపల్లెలో 1068 మందికి 1017 మంది (95%) ఓటు హక్కును వినియోగించుకున్నారు.
- గంగవరం మండలంలో పొన్నమాకులపల్లెలో 712 మందిలో 683 (96%), పొన్నమాకులపల్లె (కీలపట్ల)లో 978లో 937 మంది (96%), దండపల్లెలో 616మందిలో 591 మంది (95%), తాళ్లపల్లిలో 883 మందిలో 841 మంది (95%), కలగటూరులో 463 మందిలో 452 మంది (98%), జీఎల్ఎస్ ఫారంలో 922మందికి 883 మంది(96%),మామడుగులో 828మందికి 789మంది (95%), పసుపత్తూరులో 869కు 827 ఓట్లు (95%) పోలయ్యాయి.
- పెద్దపంజాణి మండలంలోని చలమంగలం కేంద్రంలో 679 మంది ఓట్లుండగా.. 652 మంది (96%) ఓటు వేసి ఆదర్శంగా నిలిచారు.
- వి.కోట మండలంలోని పెద్దబర్నేపల్లె కేంద్రంలో 936 ఓట్లకు 894 ఓట్లు (95.5%) పోలయ్యాయి.



గంగవరం పోలింగ్ కేంద్రంలో పోటెత్తిన ఓటర్లు (ఫైల్ ఫొటో)

కుప్పం నియోజకవర్గంలో..

కుప్పం నియోజకవర్గంలోని 23 కేంద్రాల్లో 95 శాతానికి మించిన పోలింగ్ నమోదైంది. గుడుపల్లెలో 9, కుప్పం, శాంతిపురంలో 7 చొప్పున కేంద్రాలున్నాయి.

- కుప్పం మండలంలోని దేవరాజపురంలో 882మందిగానూ 852 మంది (96.5%), టీడీచేన్లులో 758మందికిగానూ 725 మంది (95.5%), చీలేపల్లెలో 724మందికిగానూ 697 మంది (95.5%), ఏకార్లపల్లెలో 498కి 483మంది (97%), కొత్తఇండ్లులో 860కి 819 మంది (95%), సజ్జలపల్లెలో 455కిగానూ 437 మంది (96%), మంకలదొడ్డిలో 1333కి 1287 మంది (97%) ఓట్లేసి ఆదర్శంగా నిలిచారు.
- శాంతిపురం మండలంలోని వడగండ్లపల్లెలో 721కుగానూ 688 మంది (95.5%), కూతేగానిపల్లెలో 820కిగానూ 786 మంది (967%), కేపీమిట్టలో 763కిగానూ 7272మంది (95%), చౌడేపల్లెలో 721కిగానూ 690మంది (96%), గొల్లపల్లెలో 982కిగానూ 933 మంది (95%), శివరామపురంలో 1309కిగానూ 1249 మంది (95.5%) మంది ఓట్లేశారు.
- గుడుపల్లె మండలంలోని చీకటిపల్లె, కాకినాయనిచిగర్లపల్లె, మల్లదేపల్లె, దాసిమనిపల్లె, కుప్పిగానిపల్లె, అగరం, కనమనపల్లె, సంగనపల్లె 139, సంగనపల్లె 140.. కేంద్రాల్లోనూ 95శాతానికిపైగా పోలింగ్ నమోదైంది.
- రామకుప్పం మండలంలో 95శాతం దాటిన కేంద్రాలు లేవు.

అందరికీ ఆదర్శం కీలపట్టు దళితవాడ

నగరి నియోజకవర్గంలోని సుమారు పది కేంద్రాల్లో 95శాతం పోలింగ్ దాటింది. ఇదిలా ఉండగా.. నగరి మండలంలోని కీలపట్టు, కాకవేడు, మాంగాడు దళితవాడల్లో అత్యధికంగా పోలింగ్ జరిగింది. ఈ ప్రాంతాల్లోని దళితులు ఆదర్శంగా నిలిచారు. కీలపట్టు దళితవాడలో ఏకంగా వంద శాతం పోలింగ్ జరిగింది. ఇక్కడ 650 ఓట్లుండగా.. అన్నీ పోలయ్యాయి. కాకవేడు కాకవేడు దళితవాడలో 849కిగానూ 831 మంది (98%).. మాంగాడు దళితవాడలో 443 ఓట్లకుగానూ 431 ఓట్లు (97%) పోలయ్యాయి. ఇదే మండలంలోని తెరణి కేంద్రంలో 889కిగానూ 846 ఓట్లు (95%), నాగరాజకుప్పంలో 874కిగానూ 831 ఓట్లు (95%), కావేటిపురంలో 444కి 427 ఓట్లు (96%) ఓట్లు పడ్డాయి.

- విజయపురం మండలంలోని ఆలపాక కండ్రిగలో 501 ఓట్లకుగానూ 480 ఓట్లు (96%).. ఇళ్లత్తూరు హరిజనవాడలో 861కిగానూ 818 ఓట్లు (95%) పోలయ్యాయి.
- నిండ్ర మండలంలోని 183 కేంద్రంలో 402కిగానూ 390 ఓట్లు, 193 కేంద్రంలో 423కిగానూ 402 ఓట్లు పోలయ్యాయి.

మిగిలిన నియోజకవర్గాల్లో ఇలా..

- గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో మూడు కేంద్రాల్లో మాత్రమే 95శాతం పోలింగ్ దాటింది. మోపిరెడ్డిపల్లె కేంద్రంలో 507కుగానూ 484 మంది (95.5%), పెనుమూరు మండలంలోని సీఎస్ అగ్రహారం కేంద్రంలో 269కిగానూ 257 మంది (95.5%), గోపిశెట్టిపల్లెలో 699కిగానూ 666 మంది (95%) ఓట్లేశారు.
- పుంగనూరు మండలం ఏటవాకలిలో 556 మందికిగానూ 531 మంది (95.5%), చౌడేపల్లె మండలం చారాలలో 525 ఓటర్లకుగానూ 500 మంది (95%) ఓటు హక్కును వినియోగించుకున్నారు.
- చిత్తూరు రూరల్ మండలంలోని ఏనుగుంట్లపల్లెలో 723 మందికిగానూ 690 మంది (95.5%) ఓట్లేశారు. ఐరాల మండలంలోని నెల్లిమందలపల్లె కేంద్రంలో పోలింగ్ శాతం 95 దాటింది.

వేటకత్తి చూపి ఐస్ క్రీమ్స్ చోరీ



చోరీ తర్వాత దుకాణం వద్ద గుమికూడిన జనం



సీసీ టీవీలో రికార్డయిన బెదిరింపు దృశ్యం

కుప్పం, మే 23: కొందరు యువకులు ఐస్ క్రీమ్స్ షాప్‌పై పడ్డారు. జంతు బలులిచ్చే పదునైన భారీ కత్తి చూపి దుకాణం యజమానిని బెదిరించి దొరికినన్ని ఐస్‌క్రీమ్‌లు పట్టుకు వెళ్లిపోయారు. వివరాలు ఇలా ఉన్నాయి. కుప్పం పట్టణంలోని హెచ్‌పీ రోడ్డులో మణికంఠ అనే వ్యక్తి ఐస్ క్రీమ్స్ దుకాణం నడుపుతున్నాడు. బుధవారం రాత్రి గంగమాంబ అమ్మవారి విశ్వరూప దర్శనానికి వచ్చిన జనం రద్దీ తగ్గిన సమయంలో కొంతమంది యువకులు ఈ దుకాణం వద్దకు వచ్చారు. ఫ్రిజ్ బాక్స్‌లో పెట్టిన డోర్ ఓపెన్ చేసి తలా ఒక ఐస్‌క్రీం చేతిలోకి తీసుకుని జుర్రుకున్నారు. ఇంకా ఐస్ క్రీమ్‌లు కావాలని చెప్పి వీలైనన్ని ఐస్ క్రీమ్‌లు మూట కట్టుకుని బయలుదేరారు. అలా వారు ఒక్క పైసా కూడా చెల్లించకుండా వెళ్లిపోతుంటే డబ్బులకోసం చేయి చాచాడు దుకాణం యజమాని మణికంఠ. అప్పుడు తీశాడు ఆ యువకుల్లో ఒకడు.. ఇంత పెద్దగా ఉన్న వేటకత్తి. అమ్మవారికి జంతు బలులు ఇచ్చేందుకు ఇటువంటి కత్తులనే వాడతారు. ఆ కత్తిని చూస్తూనే బెదిరి వెనక్కు తగ్గాడు దుకాణం యజమాని. 'మమ్మల్నే డబ్బులడుగుతావా? ఎక్కువ చేశావంటే ఇక్కడే నరికేస్తాం' అని బెదిరించిన ఆ ఆగంతక యువకులు సుమారు రూ.4 వేలు విలువ చేసే ఐస్ క్రీమ్స్ పెట్టెలతో సహా పరారయ్యారు. ఈ ఘటన మొత్తం దుకాణం ముందు భాగాన అమర్చిన సీసీ కెమెరాలో రికార్డయింది. ప్రాణాలు మిగిలినాయి చాలురా భగవంతుడా అనుకుంటూ దుకాణం యజమాని, ఐస్‌క్రీమ్స్ చోరీపై కుప్పం అర్బన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

పశువుల అక్రమ రవాణాను అరికడతాం. జంతువుల అక్రమ వధపై కఠిన చర్యలు తీసుకుంటాం. దీనికోసం అదనపు ఎస్పీ అరీఫుల్లాను నోడల్ అధికారిగా నియమిస్తున్నాం.

- ఎస్పీ మణికంఠ తీసుకున్న నిర్ణయం.. చేసిన ప్రకటనపై ప్రజల నుంచి హర్షం వ్యక్తమవుతోంది. అయితే, క్షేత్రస్థాయిలో 'కొమ్ము డబ్బులు'కు అలవాటుపడ్డ సిబ్బంది తీరును పలువురు సందేహిస్తున్నారు.

జేబుల నిండుగా 'కొమ్ము' డబ్బులు..!

- పశు అక్రమ రవాణదారుల నెలవారీ మామూళ్లు
- ఆ వాహనాలకు 'రైట్' చెబుతున్న పోలీసులు
- ఎస్పీ నిర్ణయంతోనైనా పశుసంపద తరలింపునకు కళ్లెం పడుతుందా?

జిల్లాలో పలమనేరు, వి.కోట, కుప్పం తమిళనాడుకు సరిహద్దులో ఉన్నాయి. కేవలం 15 నిమిషాల వ్యవధిలో ఇక్కడ్నుంచి వాహనాలను తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల సరిహద్దుల్లోకి తీసుకెళ్లొచ్చు. అక్రమ రవాణా కూడా ఈ మూడు మండల కేంద్రాల మీదుగా సాగుతుంటుంది. అందుకనే ఇక్కడి పోలీసు స్టేషన్లలో పోస్టింగ్‌ల కోసం అధికారులు, సిబ్బంది పైరవీలు చేస్తుంటారు. అలాంటి ఈ మార్గంలోనే పదుల సంఖ్యలో కంటైనర్లలో.. వందలాది పశువులను రోజూ తమిళనాడు మీదుగా కేరళకు తరలిస్తుంటారు. గతంలో చిన్న లారీల్లో పశువులను తరలించేవారు. ఇప్పుడు పొడవాటి కంటైనర్లను వినియోగిస్తున్నారు. వీటి పైభాగాన పశువులకు కొద్దిమేర గాలి వచ్చేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఎవరికీ అనుమానాలు లేకుండా పశువులను అక్రమ రవాణా చేస్తున్నారు.

'సీమ' పశువులకు మంచి డిమాండు

కేరళలో పశుమాంసానికి (బీఫ్) మంచి డిమాండు. అందునా రాయలసీమ పశువులకు ఎక్కువ ప్రాధాన్యం ఉంటుందని వ్యాపారులు చెబుతున్నారు. అక్కడ పశుమాంసం కిలో రూ.500 నుంచి 800 వరకు ధర పలుకుతోంది.అందుకనే అనంతపురం, కడప, కర్నూలు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాలతో పాటు, జిల్లాలో పశువుల సంత జరిగే మదనపల్లె, పుంగనూరు, పలమనేరు, వి.కోట, బైరెడ్డిపల్లె నుంచి ఎక్కువగా పశువులను తరలిస్తున్నారు. ఒక్కో కంటైనర్‌లో 80 నుంచి 100 వరకు రవాణా చేస్తున్నారు. సంతల్లో చిన్న చిన్న దూడలను కూడా కొని తరలించేస్తున్నారు.

నిబంధనలకు నీళ్లు

పశువులను తరలించేందుకూ నిబంధనలు ఉన్నాయి. వీటిని రవాణా చేయాలంటే పశువుల యజమాని వెంటే ఉండాలి. వీటిని కొనుగోలు చేసిన రైతు వద్ద రసీదుతో పాటు పశువుల డాక్టరు సర్టిఫికెట్ వెంట ఉంచుకోవాలి. వ్యవసాయ పనులు, పాడికి మాత్రమే పశువులను తీసుకెళ్లాలి. రవాణా సమయంలో పశువులకు కావాల్సిన మేత, నీళ్ల అందుబాటులో ఉంచుకోవాలి. రెండు పశువుల మధ్య గ్యాప్ ఎక్కువగా ఉండాలి. అంటే ఒక లారీలో 10 పశువుల లోపు.. మినీ లారీల్లో రెండింటినే తరలించాలి. ఎక్కడా ఈ నిబంధనలు పాటించడం లేదు.

అక్రమార్జనకు అలవాటు పడి

కేరళలోని డిమాండుతో పశు అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. రెవెన్యూ, పశుసంవర్థక శాఖ అధికారులు ఈ అక్రమ రవాణా గురించి ఏమాత్రం పట్టించుకోవడం లేదు.



అక్రమ రవాణాకు సిద్ధం చేసిన పశువులు (ఫైల్‌ఫొటో)

ఇక, పోలీసులు మాత్రం వాహనాలు ఆపుతుంటారు. అందుకనే అక్రమ రవాణాదారులు దారిపొడవునా ఉన్న పోలీసు స్టేషన్లకు నెలవారీ మామూళ్లు ఇస్తుంటారన్న ఆరోపణలున్నాయి. ఈ నగదును పోలీసు శాఖ అధికారులు 'కొమ్ముల డబ్బు'గా పిలుస్తుంటారట. ఇలా జేబులు నిండుతుండటంతో.. వీళ్లు ఆయా కంటైనర్లను చూసీ చూడనట్లు వదిలేస్తున్నారన్న విమర్శలున్నాయి. పోలీసులు అనుకుంటే పశువుల అక్రమ రవాణాను గంట వ్యవధిలోనే అరికడతారు. కానీ, కొమ్ముల డబ్బును వదులుకొనేందుకు వీళ్లు ఇష్టపడతారా అన్నదే ప్రశ్న. పశు సంపదను కాపాడేందుకు ఎస్పీ మణికంఠ తీసుకున్న నిర్ణయాన్ని.. క్షేత్రస్థాయిలోనూ పటిష్ఠంగా అమలయ్యేలా చూడగలిగితేనే ఫలితం ఉంటుంది.

- పలమనేరు



పెద్దపంజాణి మండలం రాయలపేట వద్ద లారీలో పశువులు ఎక్కించేందుకు చేసుకొన్న ఏర్పాటు (ఫైల్ ఫొటో)

వైభవంగా అమ్మవారి జలావాసం



ఊరేగింపుగా తరలివెళ్తున్న గంగమ్మ

కుప్పం, మే 23: కుప్పంలోని శ్రీ ప్రసన్న తిరుపతి గంగమాంబ జాతర మంగళ, బుధవారాల్లో ఘనంగా జరిగింది. బుధవారం అర్ధరాత్రి దాటాక.. గురువారం తెల్లవారుజామున అమ్మవారి జలావాస ఘట్టాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. బుధవారం ఉదయంనుంచి అర్ధరాత్రి దాకా ఆలయంలో గంగమాంబ అమ్మవారు భక్తులకు విశ్వరూప దర్శనం ప్రసాదించారు. భక్తజనం తండోపతండాలుగా వచ్చి అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధల మధ్య మొక్కులు తీర్చుకున్నారు. గురువారం తెల్లవారుజాము అవుతుండగా పూజలు, ప్రత్యేక శాంతి పూజల మధ్య అమ్మవారి సంపూర్ణ రూపంనుంచి ఆమె శిరస్సును తొలగించారు. మిగిలిన మొండేన్ని తిరిగి తెర వెనుకకు చేర్చారు. అమ్మవారి శిరస్సును ఆర్టీసీ బస్టాండు ఆవరణలో గంగబావి వద్దకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఇక్కడ అమ్మవారిని కింది దించి విశేష పూజలు చేశారు. అనంతరం గంగమాంబ అమ్మవారిని జలావాసం చేయించారు. ఈ జలావాస ఘట్టంతో అమ్మవారి జాతర ఉత్సవాలు సంపూర్ణమయ్యాయి.

ఐదు మండలాల్లో వర్షం



చిత్తూరు కలెక్టరేట్, మే 23 : జిల్లా వ్యాప్తంగా గడిచిన 24 గంటల్లో ఐదు మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. పాలసముద్రంలో 11.2మి.మీ, పలమనేరు 8,0, గంగవరం 5.2, గంగాధరనెల్లూరు, కుప్పంలలో 2.0 మి.మీ వంతున వర్షపాతం నమోదైంది.

నేటి నుంచి టెన్త్, ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

చిత్తూరు (సెంట్రల్), మే 23: టెన్త్, ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. జూన్ 3వ తేదీ వరకు జరిగే టెన్త్ పరీక్షలు 2,006 మంది విద్యార్థులు రాసేందుకు వీలుగా 15 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలను జూన్ 1వ తేదీ వరకు వరకు నిర్వహిస్తారు. 10,019 మంది విద్యార్థులు రాసేందుకు గాను 31 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందులో మొదటి సంవత్సరం 7,442 మంది, రెండవ సంవత్సరం 2,577 మంది విద్యార్థులు ఉన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నారు.

- క్యాన్లు, డ్రమ్ముల్లో పెట్రోల్ కావాలంటే..

తహసీల్దార్ అనుమతి తప్పనిసరి

చిత్తూరు కలెక్టరేట్,మే 23: బ్యాంకులు, సెల్ టవర్లు, చేనేత మగ్గాల యజమానులు జనరేటర్లకు అవసరమైన డీజిల్, పెట్రోల్‌ను సంబంధిత తహసీల్దార్ వద్ద లెటర్ తీసుకెళ్లి క్యాన్లు, డ్రమ్ముల్లో పట్టుకోవాల్సి ఉంటుందని జేసీ శ్రీనివాసులు తెలిపారు. గురువారం ఆయన కలెక్టరేట్‌లోని జేసీ మీటింగ్ హాలులో డీఎస్వో శంకరన్‌తో కలిసి పెట్రోల్ బంకు యజమానులతో సమావేశమయ్యారు. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి వచ్చే నెల 4న ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపడుతున్నందున ఈసీ సూచనల మేరకు జిల్లాలోని పెట్రోల్ బంకు యజమానులు విడిగా పెట్రోల్, డీజిల్ పట్టరాదన్నారు.అత్యవసరం అనుకున్న వారు తహసీల్దార్ లేఖ చూపించాల్సి ఉంటుందన్నారు. చిల్లర దుకాణాల్లో అమ్ముతున్నట్లు తెలిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు.



తిరుమల కిటకిట

తిరుమలలో మళ్లీ భక్తుల రద్దీ పెరిగింది. శ్రీవారి ఆలయ ప్రాంతంతో పాటు మాడవీధులు, అఖిలాండం, లడ్డూకౌంటర్, అన్నప్రసాద భవనం, లేపాక్షి సర్కిల్ ప్రాంతాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి.గదుల కోసం సీఆర్వో, ఎంబీసీ, పద్మావతి, టీబీ, ఏఆర్పీ కౌంటర్ల వద్ద భక్తులు క్యూలైన్లలో బారులు తీరారు. తలనీలాలు సమర్పించే కల్యాణకట్టలు కూడా భక్తులతో నిండిపోయాయి.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

కౌంటింగ్ నిర్వహణకు ఏర్పాట్లు చేపట్టాం

● వీడియో కాన్ఫరెన్సులో కలెక్టర్ షన్మోహన్



చిత్తూరు కలెక్టరేట్, మే 23: జిల్లాలో ఒక పార్లమెంటు, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించిన కౌంటింగ్ ప్రక్రియ స్థానిక ఎస్వీసెట్ ఇంజనీరింగ్ కళాశాలలో చేపడుతున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షన్మోహన్ తెలిపారు. అక్కడ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు. గురువారం వెలగపూడి నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. చిత్తూరులోని క్యాంపు కార్యాలయం నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, ఆర్వోలు మనోజ్‌రెడ్డి, వెంకటశి, ట్రైనీ కలెక్టర్ హిమవంశీ పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ.. కౌంటింగ్ సెంటర్ల వద్ద మూడెంచల భద్రతను ఏర్పాటుచేశామని, 64 సీసీ కెమెరాలతో కౌంటింగ్ ప్రక్రియను కంట్రోల్ రూము నుంచి నిరంతరం పర్యవేక్షణ చేస్తామని చెప్పారు. ప్రతి అసెంబ్లీ, పార్లమెంటు సెగ్మెంట్లకు విడివిడిగా ఈవీఎంల కౌంటింగ్ కోసం ప్రతి నియోజకవర్గానికి 14 టేబుళ్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సిబ్బందికి ఈ నెల 25న మొదటి ర్యాండమైజేషన్ నిర్వహించి 28న తొలి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు. పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్‌లో భాగంగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి మూడుటేబుళ్లు, పార్లమెంటు నియోజకవర్గానికి 18 టేబుళ్లను ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు.

గజ గణనకు నోడల్ జిల్లాగా చిత్తూరు



చైతన్యకుమార్‌రెడ్డి

చిత్తూరు (సెంట్రల్), మే 23 : గజ గణనకు సౌత్ ఇండియాకు కర్ణాటక నోడల్ రాష్ట్రంగా, ఏపీకి చిత్తూరు నోడల్ జిల్లాగా ఉంటుందని డీఎఫ్‌వో చైతన్యకుమార్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన తన ఛాంబర్‌లో మీడియాతో మాట్లాడుతూ ఏకకాలంలో అన్ని అటవీ ప్రాంతాల్లో ఏనుగుల గణన జరుగుతోందన్నారు. రాష్ట్రంలో చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య, అనంతపురం, పార్వతీపురం, విజయనగరం జిల్లాల్లో గణన చేపట్టనున్నట్లు తెలిపారు. చిత్తూరు 120, తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లో 40, పార్వతీపురం, విజయనగరంలో 14 వరకు ఏనుగులు ఉంటాయని ప్రాథమిక అంచనా వేశారని పేర్కొన్నారు. విద్యుదాఘాతం ఇతర కారణాలతో ఏటా 8 నుంచి 10 ఏనుగులు మృతి చెందుతుండగా, వాటి బారినపడి ఏటా తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోతున్నారని వివరించారు. ఏనుగులు, ప్రజల మరణాల నివారణకు అటవీ శాఖ తగు చర్యలు చేపట్టినట్లు వివరించారు.

కాణిపాకంలో వైభవంగా పున్నమి గరుడ సేవ



గరుడ వాహనంపై ఊరేగుతున్న వరదరాజస్వామి

ఐరాల(కాణిపాకం),మే 23: కాణిపాకంలో వెలసిన వరదరాజస్వామి ఆలయంలో గురువారం పున్నమి గరుడ సేవను వైభవంగా నిర్వహించారు. ఉదయం వరదరాజస్వామి మూల విరాట్‌కు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భక్తుల ఆధ్వర్యంలో సత్యనారాయణ స్వామి పూజ, వ్రతం నిర్వహించారు. రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత వరదరాజస్వామి ఉత్సవ విగ్రహాలను గరుడ వాహనంపై కాణిపాక వీధులలో ఊరేగించారు. స్వామి దర్శనార్థం వందలాది మంది భక్తులు వచ్చారు. ఈవో వెంకటేశు, ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి, సూపరింటెండెంట్లు శ్రీధర్‌బాబు, కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్లు రమేష్, విఘ్నేష్ పాల్గొన్నారు.

ముక్కంటి ఆలయంలో రద్దీ



శ్రీకాళహస్తి, మే 23 : శ్రీకాళహస్తీశ్వరాలయం గురువారం భక్తజనసంద్రంగా మారింది. పౌర్ణమిని పురస్కరించుకుని రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. సుమారు 27వేలమంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. రూ.200 శీఘ్ర దర్శనం టిక్కెట్ల ద్వారా 6457మంది, రూ.50ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా 1,667మంది భక్తులు దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 1,850మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 488మంది, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 197మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 148మంది, రూ.5వేల టిక్కెట్ల ద్వారా 50మంది భక్తులు పూజలుచేయించుకున్నారు. ఇక ఐదు రకాల ప్రసాదాలు కలిపి 15,049అమ్ముడైనట్లు ఆలయ అధికారులు తెలిపారు.

నేటినుంచి పాలిసెట్ కౌన్సెలింగ్

తిరుపతి(విద్య), మే 23: పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన ఏపీ పాలిసెట్ కౌన్సెలింగ్ శుక్రవారం నుంచి ప్రారంభంకానుంది.పాలిసెట్ ర్యాంకర్లు 24నుంచి జూన్2లోపు ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాలని తిరుపతిలోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.ద్వారకనాథరెడ్డి సూచించారు.ర్యాంకుల వారీగా 27నుంచి జూన్ 3వతేదీవరకు ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటుందని, విద్యార్థులు సంబంధిత ఒరిజనల్ సర్టిఫికెట్లతోపాటు రెండుసెట్ల జిరాక్స్ కాపీలను వెంట తీసుకురావాలని తెలిపారు. మే 31నుంచిజూన్5లోపు ఆప్షన్లు నమోదుచేసుకోవాలని, చివరిరోజు ఆప్షన్లలో మార్పులకు, చేర్పులకు అవకాశం ఉందని వివరించారు. జూన్ 7న విద్యార్థుల సెల్‌ఫోన్ నెంబర్లకు సీటు అలాట్‌మెంట్ సమాచారం అందుతుందని, 10నుంచి తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. స్పెషల్ కేటగిరీ విద్యార్థులు (పీహెచ్, సీఏపీ, ఎన్‌సీసీ, స్పోర్ట్స్ అండ్ గేమ్స్)విజయవాడలోని గవర్నమెంట్ పాలిటెక్నిక్‌లో నిర్వహించే కౌన్సెలింగ్‌కి హాజరై తమ ధ్రువపత్రాలను పరిశీలన చేసుకోవాలని సూచించారు. పాలిసెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులు హెచ్‌టీటీపీఎస్://ఏపీపాలిసెట్.ఎన్ఐసీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజును చెల్లించాలన్నారు.

● ర్యాంకులవారీగా ధ్రువపత్రాల పరిశీలన తేదీలు ఇలా: 27న ఒకటినుంచి 12వేలర్యాంకుల వరకు, 28న 12,001-27,000వరకు, 29న 27,001-43,000వరకు, 30న 43,001-59,000వరకు, 31న 59,001-75,000వరకు, జూన్1న 75,001-92,000వరకు, 2న 92,001-108000వరకు, 3న 108001-చివరిర్యాంకు వరకు విద్యార్థులు హాజరై తమ ధ్రువపత్రాలను వెరిఫై చేసుకోవాల్సిఉంది.

● తీసుకురావాల్సిన సర్టిఫికెట్లు ఇవీ: కౌన్సెలింగ్‌కి హాజరయ్యే విద్యార్థులు ప్రాసెసింగ్ ఫీజు పేమెంట్ రశీదు, పాలిసెట్ హాల్‌టికెట్, ర్యాంకు కార్డు, పదవతరగతి/ఈక్వలెంట్ మార్కుల జాబితా, 4నుంచి పదితరగతులవరకు స్టడీ సర్టిఫికెట్స్, కులధ్రువీకరణపత్రం(బీసీ,ఎస్సీ,ఎస్టీ), ఆదాయ ధ్రువీకరణపత్రం, ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్, టీసీలను వెంట తెచ్చుకోవాలి.

ఇండస్ట్రియల్ కారిడార్‌లో రోడ్డు నిర్మాణంపై కసరత్తు



రోడ్డు నిర్మాణంపై కసరత్తు చేస్తున్న అధికారుల బృందం

శ్రీకాళహస్తి, మే 23: విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధిలో భాగంగా ఏర్పాటు చేయనున్న రోడ్డు భూసేకరణపై అధికారుల బృందం కసరత్తు చేసింది. తొట్టంబేడు మండలం పొయ్య వద్ద వున్న జాతీయ రహదారి నుంచి బుచ్చినాయుడుకండ్రిగ మండలంలోని పల్లమాల వద్ద తడ రహదారి వరకు ఇండస్ట్రియల్ కారిడార్ రోడ్డును 9.5కి.మీ పొడవు, 45మీటర్ల వెడల్పుతో నాలుగులేన్ల రోడ్డును నిర్మించేందుకు ఇప్పటికే సర్వే పూర్తి చేసిన అధికారులు పలువురికి పరిహారం కూడా అందజేశారు.ఈ నేపథ్యంలో గురువారం ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు, ఆర్అండ్‌బీ, సోషియల్ ఆర్ఆర్‌తదితరశాఖల అధికారుల బృందం పొయ్య, గుమ్మడిగుంట, గౌడమాల గ్రామాలతో పాటు బుచ్చినాయుడు కండ్రిగ మండలంలోని కొత్తపాళెం, పల్లమాల గ్రామాల వద్ద పర్యటించారు. రోడ్డు విస్తరణలో భాగంగా నష్టపోయే ఇండ్లను,పంటలను, ప్రభుత్వ ఆస్తులను పరిశీలించారు.అలాగే ఆస్తులు కోల్పోతున్న కుటుంబాలవారితో మాట్లాడారు. భూసేకరణకు సంబంధించిన సమస్యలపై అధ్యయనం చేశారు. రోడ్డు నిర్మాణం పూర్తయిన వెంటనే ఈ ప్రాంతంలో ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా సెజ్ ఏర్పాటవుతుందని తెలిపారు. అధికారులు దేవరాజు, రాంబాబు, గిరీశ్వర్, ఉదయ్‌శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కౌంటింగ్ కేంద్రాల వద్ద అప్రమత్తంగా ఉండండి



కౌంటింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న జేసీ

ఎస్వీసెట్‌లోని స్ట్రాంగ్‌రూములు, కౌంటింగ్ కేంద్రాల వద్ద అనునిత్యం అప్రమత్తంగా విధులు నిర్వహించాలని చిత్తూరు ఆర్వో జేసీ శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం ఇక్కడి స్ట్రాంగ్ రూములు, కౌంటింగ్ కేంద్రాలు, పోస్టల్ బ్యాలెట్, మీడియా సెంటర్, ఇతర రూములను ఆయన తనిఖీ చేశారు. ఏడు అసెంబ్లీ, చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గాలకు వేర్వేరుగా కౌంటింగ్‌కు సంబంధించి ఏర్పాట్లను పరిశీలించి బ్యారికేడింగ్ వ్యవస్థను పకడ్బందీగా సిద్ధం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు ఆర్డీవో చిన్నయ్య, కమిషనరు అరుణ, మెటీరియల్ మేనేజ్‌మెంట్ అధికారి షణ్ముగం, తహసీల్దార్లు, అధికారులు పాల్గొన్నారు.

పుంగనూరు ఓట్ల లెక్కింపు సజావుగా నిర్వహించాలి

● సీఈవోకు టీడీపీ నేత వినతిపత్రం



ముఖేష్‌కుమార్ మీనాకు వినతిపత్రం అందజేస్తున్న వెంకటరమణ

కల్లూరు, మే 23: పుంగనూరు నియోజకవర్గం ఎన్నికల ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రక్రియ సజావుగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనాను పులిచెర్ల మండలానికి చెందిన రాష్ట్ర టీడీపీ ఎస్సీ సెల్ విభాగం ప్రధాన కార్యదర్శి ముల్లంగి వెంకటరమణ కోరారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి వినతిపత్రం అందజేశారు. పుంగనూరు నియోజకవర్గంలో ఇటీవల జరిగిన వైసీపీ దాడులు, దౌర్జన్యాలను దృష్టిలో పెట్టుకొని ఓట్ల లెక్కింపు రోజుల ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేయాలన్నారు. ఓట్ల లెక్కింపు తర్వాత ఎలాంటి అల్లర్లు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో సీఈవోను కోరినట్లు ఆయన చెప్పారు.

రెండో రోజూ గజ బీభత్సం

సుమారు 5 టన్నుల మామిడి కాయలు నేలరాల్చిన ఏనుగులు

శాశ్వత పరిష్కారంపై దృష్టి సారించని అధికారులు





ఏనుగుల దాడిలో నేలరాలిన మామిడి కాయలను చూపిస్తున్నరైతులు - ధ్వంసమైన బోరు పైపులు

కల్లూరు, మే 23: పులిచెర్ల మండలంలో ఏడాదిగా ఏనుగుల గుంపు తిష్టవేశాయి. అటవీ సమీప పంట పొలాలపై పడి తొక్కేస్తున్నాయి. వ్యవసాయ పరికరాలను విరిచేస్తున్నాయి. దీంతో రైతులకు అపారనష్టం వాటిల్లుతోంది. ఇలా మండలంలోని ఎల్లంకివారిపల్లి పంచాయతీ దిగుమూర్తివారిపల్లి సమీపంలో రెండో రోజైన బుధవారం రాత్రి పంట పొలాలపై ఏనుగులు పడి బీభత్సం సృష్టించాయి. 30 ఏళ్ల మామిడి చెట్లను విరిచేసి టన్నుల కొద్దీ కాయలను నేలరాల్చాయి. రైతులు వీరరాఘవులునాయుడు, ఈశ్వర్‌నాయుడు, పురుషోత్తంనాయుడు, సురేష్‌నాయుడు, విద్యాసాగర్‌నాయుడు, వేణుగోపాల్‌నాయుడు, రామమూర్తినాయుడు, ఆదికేశవులునాయుడు తదితర రైతులు మామిడిచెట్లను విరిచేశాయి. సుమారు 5 టన్నుల మామిడికాయలను నేలరాల్చడంతో రైతులు లబోదిబోమంటున్నారు. బోరుపైపులు, డ్రిప్‌పైపులు, గేట్‌వాల్‌ను ధ్వంసంచేశాయి. దీంతో ఎప్పుడు, ఎక్కడ దాడికి దిగుతాయో తెలియక అటవీ ప్రాంత సరిహద్దుల్లోని ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

కాయ కాయకీ రక్షణ



గంగాధరనెల్లూరు, మే 23: అసలే ఈసారి మామిడి కాయల కాపు చాలా తక్కువ. చెట్లకు కాసిన ప్రతి మామిడి కాయకూ కవర్లతో రక్షణ కల్పిస్తున్నారు రైతులు. గతంలో మామిడితోపుల్లో మామిడి కాయలు దిగుబడి అనుకోని విధంగా రావడంతో.. వాటిని జ్యూస్‌ఫ్యాక్టరీలకు, మామిడి కాయల మండీలకు రైతులు తోలుకొని డబ్బులు తీసుకునేవారు. వాతావరణం పరిస్థితుల దృష్ట్యా ఈసారి గంగాధరనెల్లూరు మండలంలోని మామిడి తోపుల్లో కొన్నిచెట్లకు మాత్రమే దిగుబడి అక్కడక్కడ కనిపిస్తోంది. మరికొందరు రైతులకు ఈసారి పూర్తిగా మామిడిచెట్లల్లో దిగుబడి లేక వెలవెల పోతుంది. మండలంలోని పాతపాళ్యం పంచాయతీ మిట్టకొత్తూరు గ్రామానికి చెందిన రైతులు ఎర్రగుంట్ల కృష్ణమనాయుడు, ఎంప్రాల వెంకటేశులునాయుడుకు మామిడితోపుల్లోని చెట్లకు అక్కడక్కడ మామిడికాయలు దిగుబడి వచ్చాయి. ఒక్కొక్కసారి వర్షాలు రాళ్ళవాన కురిస్తే దాని కారణంగా మామిడికాయలు దెబ్బతిని రైతు నష్టపోయేపరిస్థితి ఉంది. అలాంటి పరిస్థితి రాకుండా.. ఈ రైతులిద్దరూ ముందు జాగ్రత్తగా సుమారు రెండు నెలల క్రితమే ప్రతి మామిడికాయకు కవర్లతో రక్షణ కవచాన్ని ఏర్పాటు చేసుకున్నారు. దీనివల్ల ఆ మామిడికాయలకు పురుగుల బెడద లేకుండా చూసుకోవడంతో పాటు వీటిని భద్రంగా కాపాడుకోగలిగితే పెట్టుబడిలో కొంతవరకైనా రాబట్టుకోవచ్చని ఉద్యాన శాఖ అధికారులు సూచిస్తున్నారు.

నిఘా నీడలో మహిళా వర్సిటీ

● 500 మీటర్ల వరకు నో వెహికల్ జోన్

● అన్ని వైపులా రోడ్లు దిగ్బంధం



మహిళా వర్సిటీ రోడ్డులో మూతబడ్డ షాపులు

తిరుపతి(నేరవిభాగం), మే 23 : వచ్చే నెల 4వ తేది కౌంటింగు జరగనున్న మహిళా వర్సిటీ వద్ద పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేశారు. టీడీపీ చంద్రగిరి అభ్యర్థి పులివర్తి నానీపై హత్యాయత్నం జరిగిన తర్వాత పోలీసు యంత్రాంగం పూర్తిగా అప్రమత్తమైంది.వర్సిటీకి 500 మీటర్ల పరిధిలో చుట్టు పక్కల రోడ్లు నో వెహికల్ జోన్‌గా వుంచారు. అన్ని ప్రాంతాల్లో పోలీసు బలగాలను ఏర్పాటు చేసారు. వర్సిటీ లోపలికి వెళ్ళే రెండు ప్రధాన గేట్ల వద్ద కేంద్ర బలగాలతో పాటు తిరుపతి శాంతి భద్రతల పోలీసులను నియమించారు. వీరు కాకుండా కేంద్ర బలగాలు 24 గంటలూ గస్తీలో వుండేలా పికెట్లు ఏర్పాటు చేశారు. లోపలికి వెళ్ళే ప్రతి ఒక్కరినీ తనిఖీ చేసి వివరాలను ఎంట్రీబుక్‌లో నమోదు చేస్తున్నారు.చుట్టుపక్కల దుకాణాలు మూసివేయించారు.ద్విచక్ర వాహనాలను సైతం అనుమతించడం లేదు. గాయత్రినగర్, కృష్ణానగర్‌లకు వెళ్ళే అన్ని రోడ్లు మూసివేయడంతో మహిళా వర్సిటీ ప్రాంగణం కర్ఫ్యూ వాతావరణాన్ని తలపిస్తోంది.

పోలీసు అధికారులకు నోటీసులు

● కూచువారిపల్లెవాసులపై కేసులో వివరణ కోరిన ఈసీ

చంద్రగిరి, మే 23: చంద్రగిరి మండలం, కూచువారిపల్లెలో జరిగిన దాడులకు సంబంధించి ఐటీ ఉద్యోగులు, వైద్య వృత్తిలో పనిచేస్తున్న టీడీపీ సానుభూతి పరులపై అక్రమ కేసులు బనాయించారని గ్రామస్తులు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. కూచువారిపల్లెకు చెందిన మహేష్ హైదరాబాదులో, ఎస్.దీపిక తిరుపతిలో వైద్యులుగా పనిచేస్తున్నారు. అదేవిధంగా హైదరాబాదులో హరీష్, వంశీ, బెంగళూరులో బాలాజి, మోహన్, చెన్నైలో ముకేష్, నాగేంద్ర, ఆదర్శ్, శ్రావణి ఐటీ కంపెనీల్లో పనిచేస్తున్నారు. పోలింగ్ రోజున ఓటు హక్కు వినియోగించుకోవడానికి గ్రామానికి వచ్చిన తమపై వైసీపీ ఫిర్యాదుతో పోలీసులు కేసులు బనాయించారని ,దానివల్ల తమ భవిష్యత్తు అంధకారమయ్యే ప్రమాదముందని ఈసీకి ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదుతో స్పందించిన ఎన్నికల కమిషన్ ఈ కేసులపై వివరణ ఇవ్వాలని పోలీసుశాఖకు నోటీసులు జారీ చేసింది.

ఆరోగ్యశ్రీ పెండింగ్ బిల్లుల చెల్లింపునకు కృషి చేయండి

● కలెక్టర్‌కు ప్రైవేటు ఆస్పత్రుల విజ్ఞప్తి



కలెక్టర్‌తో మాట్లాడుతున్న ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలు

తిరుపతి(కలెక్టరేట్), మే 23: ఎన్నికల కోడ్‌ను పరిగణనలోకి తీసుకుని ప్రైవేటు ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలను కొనసాగించాలని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ యాజమాన్యాలకు విజ్ఞప్తి చేశారు. గురువారం కలెక్టరేట్‌లో ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలతో కలెక్టర్ సమీక్షించారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ నిలిపివస్తే రోగులు ఇబ్బందులు పడుతారని, ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని సేవలను కొనసాగించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న ఆరోగ్యశ్రీ బిల్లుల చెల్లింపునకు చర్యలు చేపడుతామని యాజమాన్యాలకు హామీ ఇచ్చారు. ప్రస్తుతానికి ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు ప్రభుత్వం కొంత మొత్తంలో నిధులు విడుదల చేసిందన్నారు. చాలా వరకు ఆరోగ్యశ్రీ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటి చెల్లింపుపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కలెక్టర్‌ను ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలు అభ్యర్థించారు. సమావేశంలో జిల్లా సమన్వయ అధికారి రాజశేఖర్‌రెడ్డి, ప్రైవేటు ఆస్పత్రుల ఎండీలు డాక్టర్ వెంకటరమణ, సుధారాణి, రమేష్‌శివకుమార్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ హుండీ ఆదాయం రూ.34.44 లక్షలు



కుప్పం, మే 23: కుప్పంలోని శ్రీ ప్రసన్న తిరుపతి గంగమాంబ హుండీ ఆదాయం రూ.34,44,290 గా తేలింది. అమ్మవారి జాతర ముగిసిన తర్వాత గురువారంనాడు దేవదాయ, ధర్మదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ప్రసన్న లక్ష్మి ఆధ్వర్యంలో ఆలయ ఆవరణలోనే హుండీ లెక్కింపు జరిగింది. భక్తులు అమ్మవారికి హుండీ ద్వారా సమర్పించిన బంగారు కానుకలు 82.5 గ్రాములు, వెండి ఆభరణాలు 241.8 గ్రాములు ఉన్నాయి. ఈ హుండీ లెక్కింపులో టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్ రెడ్డి, ఈవో చలపతి తదితరులు పాల్గొన్నారు.

అతిసారతో వృద్ధురాలి మృతి

నడింపల్లెలో కొనసాగుతున్న వైద్య శిబిరాలు



మునెమ్మ (ఫైల్ ఫొటో)

శాంతిపురం, మే 23: శాంతిపురం మండలం నడింపల్లె గ్రామంలో అతిసార లక్షణాలతో గురువారం వృద్ధురాలు మునెమ్మ మృతి చెందారు. ఈ గ్రామంలో మంగళవారం వాంతులు, విరేచనాలతో పలువురు అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రమాదం లేదని అధికారులు తెలపడంతో అందరూ తమ ఇళ్లకు చేరుకొన్నారు. గ్రామంలో అందరూ కోలుకోగా మునెమ్మ(70) మాత్రం మృతి చెందినట్లు ఆమె కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తెలిపారు. ఈమె మృతి వషయం తెలిసి డీపీవో లక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ పురుషోత్తం, రాళ్లబూదుగురు పీహెచ్‌సీ వైద్యుడు శివకుమార్, పంచాయతీ అధికారులు గ్రామంలో పర్యటించి వైద్య సేవలను అందించారు. సర్పంచ్ బాలకృష్ణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో పారిశుధ్య పనులు చేపడుతున్నారు. గ్రామంలో వాంతులు, విరేచనాలు పూర్తిగా తగ్గుముఖం పడ్డాయని అధికారులు తెలిపారు.

జాతరలో చోరీలు రెండే

పలమనేరు, మే 23: పలమనేరులో మూడు రోజులు నిర్వహించిన జాతరలో ఇద్దరు మహిళలు మాత్రం తమ మెడలోని బంగారు గొలుసులు చోరీ జరిగాయని పోలీసులకు ఫిర్యాదు చేశారు. వి.కోట మండలం చింతల గుంట గ్రామానికి చెందిన లక్ష్మమ్మ, పలమనేరుకు చెందిన ఆర్టీసీ ఉద్యోగి సుధాకర్ భార్య వసంత జాతర సందర్భంగా టెంకాయలు కొడుతున్నారు. ఆ సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు వీరి మెడలోని బంగారు చైన్లు లాక్కెళ్లిపోయారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు సీసీ పుటేజీలు పరిశీలించే పనిలో పడ్డారు.

విక్టరీ బార్ నుంచే నానీపై దాడికి పథక రచన

తిరుపతి(నేరవిభాగం), మే 23: తిరుపతిలోని మహిళా వర్సిటీ వద్ద చంద్రగిరి టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీపై జరిగిన హత్యాయత్నం ఘటనకు సమీపంలోని విక్టరీ బార్ నుంచే పథక రచన చేసినట్లు పోలీసుల దర్యాప్తులో గుర్తించినట్లు సమాచారం.బార్‌లోనే మధ్యాహ్నం ఫుల్‌గా మద్యం సేవించిన నిందితులు అక్కడే దాచి వుంచిన సమ్మెట, రాడ్లు, ఖాళీ బీరు బాటిళ్ళను కారులో వేసుకొచ్చి నానీపై దాడికి ఒడిగట్టినట్లు సమాచారం. దీనిపై అక్కడ వున్న సీసీ పుటేజీ, అరెస్టు అయిన ముద్దాయిలిచ్చిన వాంగ్మూలాల మేరకు ఎస్వీయూనివర్సిటీ పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికే బార్‌లో వున్న సీసీ పుటేజీని స్వాధీనం చేసుకున్న పోలీసులు ఆ రోజు ఎవరెవరు అక్కడకు వచ్చారు..వారికి ఆతిథ్యం ఇచ్చిన వారెవరనే విషయాలపై దర్యాప్తు చేస్తున్నారు.నానీపై హత్యాయత్నం కేసులో అరెస్టయి కడప జైల్లో వున 13మందిలో తిరుమలకు చెందిన హరి, సుధాకర రెడ్డి, రాములు వున్నారు. తిరుమలలో పెయింటర్‌గా పనిచేస్తున్న శ్రీనివాసులుపై దాడి కేసులో ఈ ముగ్గురూ నిందితులు కావడంతో కేసు నమోదు చేసి అందరికీ 41 కింద నోటీసులు ఇచ్చినట్లు తిరుమల టూ టౌన్ సీఐ సత్యనారాయణ సిట్ అధికారులకు వివరించినట్లు తెలిసింది.నానీపై హత్యాయత్నం కేసులో మరి కొంతమందిని అరెస్టు చేయడానికి పోలీసులు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

తిరుపతి - 9160195583, 9703618708
9703618705, 9703618710
9985411629, 9985410347, 9985411003
చిత్తూరు - 9985411584, 9985403122
మదనపల్లి - 9985417476, 9848161191
కుప్పం - 9985403032 పలమనేరు - 9985403032
పుంగనూరు - 9985403204, పీలేరు - 9985403045
పుత్తూరు - 9985411598, శ్రీకాళహస్తి - 9985411596

WANTED

Rtd. Employee /VRS మరియు Qualified సీనియర్ సిటిజన్స్‌కి సువర్ణ అవకాశం. తిరిగి మీ పూర్వ వైభవాన్ని పునర్నిర్మించడం కొరకు సం.ప్ర. KUBER RESIDENCY, TPT. 89784 71248

AJT-3050

WANTED

తిరుపతిలో వివిధ బ్రాంచీలు గల హోటల్ (లాడ్జ్) నందు పనిచేయుటకు రూమ్ బాయ్స్ (10), హౌస్ కీపింగ్(6), వాచ్ మెన్లు (3) కావలెను. Cell: 7093956342

AJT-1899

రాజస్థాన్ రైలు యాత్ర

దసరా సందర్భంగా రాజస్థాన్ రైలుయాత్ర తేది.01-10-24. 11రోజులు టికెట్ 21,000/- (భోజనం, ACరూం+ ACబస్సు) కె.వాసు నెల్లూరు. సం.ప్ర. సెల్: 94913 40504

AJR-178309

బంగారం కొనబడును

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(లైసెన్స్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డ్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర: 7382114647

AJA-177000

పాఠకులకు ముఖ్యగమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన/క్లెయిమ్స్‌కు, దట్ల వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

విధ్వంసకర ఘటనలను ఎదుర్కోవడంపై పోలీసుల మాక్ డ్రిల్





మాక్ డ్రిల్‌లో భాగంగా ఇంటి పట్టాలు ఇవ్వాలని ఆందోళన చేస్తున్న ప్రజలు, అదుపుచేస్తున్న పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), మే 23: కౌంటింగ్ రోజు అల్లరి మూకలు పాల్పడే విధ్వంసాలు, అల్లర్లు, ఇతరత్రా ఘటనలు జరిగితే ఎలా ఎదుర్కోవాలనే అంశాలపై తిరుపతి పోలీసు పెరేడ్ గ్రౌండులో గురువారం ఎస్పీ హర్షవర్ధనరాజు నేతృత్వంలో పోలీసులు మాక్ డ్రిల్ నిర్వహించారు. కలెక్టర్ కార్యాలయం వద్ద ఇంటి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ప్రజలు పెద్ద ఎత్తున ఆందోళన చేయడం, కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడించడానికి వెళుతున్న ఆందోళనకారులను పోలీసులు ఎలా ఎదుర్కోవాలి... మాబ్ పెద్ద ఎత్తున గుమికూడి చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని సంఘ విద్రోహక శక్తులు పాల్పడే విధ్వంసకర ఘటనలను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి పోలీసులు అన్ని విధాలా సిద్ధంగా ఉన్నారనే విషయాన్ని ప్రజలు, ట్రబుల్ మాంగర్స్‌కు తెలియజేయడానికి మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీలు కులశేఖర్, శ్రీనివాసులు, డీఎస్పీలు, సీఐలు పాల్గొన్నారు.

హిసర్-తిరుపతి మధ్య ఎక్స్‌ప్రెస్ రాకపోకల పొడిగింపు

తిరుపతి(సెంట్రల్), మే 23: హిసర్-తిరుపతి మధ్య నడుస్తున్న ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్ల (09715-09716) జూన్1 నుంచి 29వ తేదీ వరకు రాకపోకలు పొడిగించినట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు. వేసవి సెలవుల రద్దీ కారణంగా ఈ ప్రత్యేక రైలును పొడిగిస్తున్నట్లు అధికారులు తెలిపారు.

బాటిళ్లలో పెట్రోల్ విక్రయించరాదు



పెట్రోల్ బంక్ నిర్వాహకులతో మాట్లాడుతున్న తహసీల్దార్ శివరాముడు

చౌడేపల్లె, మే23: ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున టపాకాయలు, లూజ్ పెట్రోల్ విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ శివ రాముడు హెచ్చరించారు. గురువారం ఆయన టపాయకాల దుకాణాల యజమానులు, పెట్రోల్ బంకు యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టపాకాయలు ఎవరికీ విక్రయించరాదన్నారు. బాటిళ్లలో, క్యాన్లలో పెట్రోలు విక్రయించ రాదని సూచించారు. అనంతరం పెట్రోల్ బంకులను తనిఖీ చేశారు. ఈ కార్య క్రమంలో ఆర్ఐ సుధాకర్ పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా ప్రథమ శయనోత్సవం



ప్రత్యేక అలంకారంలో మృత్యుంజయేశ్వరస్వామి దంపతులు

చౌడేపల్లె, మే23: స్థానిక బజారు వీధిలో వెలసిన అభీష్టద మృత్యుంజయేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో 11వ రోజు ఆది దంపతులకు శాస్త్రోక్తంగా ప్రథమ శయనోత్సవం నిర్వహించారు. గురువారం ఉదయం స్వామివారికి ఆలయ ప్రధానా ర్చకులు రాజశేఖర్ దీక్షితులు, కుమార, మహేష్ దీక్షితులు పంచామృతాభిషేకాలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. రాత్రి ఆలయంలో ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పట్టుపాన్పుపై శాస్త్రోక్తంగా శయనోత్సవం జరిపించారు. ఉభయ దారులుగా అమిని గుంటకు చెందిన రాజేంద్రరాయల్ కుటుంబీకులు వ్యవహరించారు.

వెంకటేశ్వరస్వామికి పౌర్ణమి పూజలు



సోమల, మే 23: మొలకల పౌర్ణమి వేడుకలను పురస్కరించుకుని స్థానిక పరుష వెంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక అభిషేక పూజలు జరిపారు. ఈ సందర్భంగా ఉత్సవ మూర్తులను సుందరంగా అలంకరించి హోమాది కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు జరిపారు. ఆలయ అర్చకులు పాగొండ వేణుగోపాల్, ధర్మకర్తలు మునిరత్నం, చంద్రశేఖర్, శ్యాంసుందర్‌బాబు భక్తులకు అన్నదానం చేశారు.

సమస్యాత్మక గ్రామాల్లో పికెటింగ్



పెద్దఉప్పరపల్లెలో గ్రామస్తులతో ఎస్ఐ వెంకట నరసింహులు

సోమల, మే 23: మండలంలోని పలు సమస్యాత్మక గ్రామాల్లో పోలీసు పికెటింగ్‌లు ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ వెంకటనరసింహులు తెలిపారు. గురువారం రాత్రి పెద్ద ఉప్పరపల్లె, ఆవులపల్లె, టీ.ఎం గొల్లపల్లె తదితర గ్రామాల్లో గ్రామస్తులతో ఆయన మాట్లాడారు. జూన్ 4న ఓట్ల లెక్కింపు జరుగుతుందని ఆ సమయలో ఎవరూ ఎలాంటి కవ్వింపు చర్యలు చేయరాదని స్పష్టంచేశారు. గ్రామాల్లో యువకులు బెట్టింగ్‌లు, ఘర్షణలకు దూరంగా ఉండాలని సూచించారు.

రక్తి కట్టించిన ద్రౌపదీ వస్త్రాపహరణం



ద్రౌపదీ దేవిని ఊరేగిస్తున్న భక్తులు

గుడుపల్లె, మే 23: మండలంలోని యామగానిపల్లె ద్రౌపది సమేత ధర్మరాజుల మహాభారత వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి ద్రౌపదీ వస్త్రాప హరణం నాటకం రక్తికట్టించింది. ఉదయం ధర్మరాజుల మూలవిగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి వివిధ రకాల పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. రాత్రి ఆలయం ఎదుట మండపంలో ద్రౌపదీ వస్త్రాపహరణం నాట్య ప్రదర్శనతో కళాకారులు భక్తులను మెప్పించారు. అనంతరం ద్రౌపదీదేవిని పట్టువస్త్రాలు, ఆభరణాలు, రంగురంగుల పుష్పాలతో అలంకరించి మంగళ వాయిద్యాలతో ఆలయ వీధుల్లో ఊరేగించారు. మహిళలు అమ్మవారికి కర్పూరహారతులు సమర్పించారు.

క్రీడాస్ఫూర్తిని నింపడానికే క్రికెట్ పోటీలు



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న కళాశాల యాజమాన్యం

గంగవరం, మే 23: విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తిని నింపడానికే మదర్ థెరిసా కళాశాలలో మూడు రోజుల క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించినట్లు కళాశాల అకడమిక్ డైరక్టర్ రాజేంద్రరెడ్డి పేర్కొన్నారు. గురువారం మదర్‌థెరిసా కళాశాలలో మూడు రోజుల క్రికెట్ టోర్నమెంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ క్రికెట్ పోటీలకు చిత్తూరు జిల్లాతోపాటు అనంతపురం, కడప, కర్నూలు జిల్లాల నుంచి క్రికెట్ జట్లు పాల్గొంటున్నాయని వివరించారు. విజేతలకు నగదు ప్రోత్సాహకాలు, మెమెంటోలు, ప్రశంసా పత్రాల అందిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ సునీల్ కుమార్, పలువురు అధ్యాపకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

అర్ధగిరిలో ప్రత్యేక పూజలు

తవణంపల్లె, మే 23: అర్ధగిరి వీరాంజనేయస్వామి ఆలయంలో గురువారం పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు వేణుగోపాలాచార్యుల ఆధ్వర్యంలో ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, సుదర్శన హోమం నిర్వహించారు. సాయంత్రం స్వామి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి, మేళతాళాల నడుమ ప్రాకారోత్సవం నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నదానం ఏర్పాటు చేశారు.

డిప్యూటీ ఈవో నియామకాలకు రేపు చిత్తూరులో స్ర్కీనింగ్ పరీక్షలు

చిత్తూరు కలెక్టరేట్, మే 23: ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో డిప్యూటీ ఎడ్యుకేషనల్ అధికారుల నియామకం కోసం శనివారం ఆబ్జెక్టివ్ తరహాలో కంప్యూటర్ బేస్డ్ స్ర్కీనింగ్ పరీక్షలు చిత్తూరులో నిర్వహించనున్నట్లు కలెక్టర్ షన్మోహన్ తెలిపారు. సీతమ్స్ కళాశాల, వేము ఇంజనీరింగ్ కళాశాల, మదర్ థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలను పరీక్ష కేంద్రాలుగా ఎంపిక చేశామని పేర్కొన్నారు. 730 మంది అభ్యర్థులు హాజరవుతున్నట్లు వివరించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 11.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందని, అభ్యర్థులను 7 నుంచి 8.30 గంటల మధ్య కేంద్రాల్లోకి అనుమతిస్తామని, నిమిషం ఆలస్యమైన అనుమతించేది లేదని ఒక ప్రకటనలో తెలిపారు.

శాస్త్రోక్తంగా చండీహోమం



చౌడేపల్లె, మే23: ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రీతి కరమైన చండీ హోమాన్ని శాస్త్రోక్తంగా వేదపండితులు నిర్వహించారు. మంగళవారం పౌర్ణమి సందర్భంగా అద్దాలమండపం వద్ద కలశ స్థాపన చేసి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారి మూలమంత్రాన్ని భక్తులచే పఠింపజేశారు. సహస్ర కుంకుమార్చన చేయించారు. అనంతరం చండీ హోమాన్ని భక్తులచే ఆచరింపజేశారు. అధికసంఖ్యలో భక్తులు హోమంలో పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లను ఆలయ చైర్మన్ నాగరాజరెడ్డి, ఈవో చంద్రమౌళి పర్యవేక్షించారు.

ఆలయాల్లో మొలకల పౌర్ణమి పూజలు



రావిళ్లవారిపల్లె రామాలయంలో మొలకలు

రొంపిచెర్ల,ఏప్రిల్23: మండలంలోని పలు ఆలయాల్లో మొలకల పౌర్ణమి పురస్క రించుకొని విశిష్ట పూజలు చేశారు. రొంపిచెర్ల శివాలయంలో, పెద్దగొట్టిగళ్లు ఓంకారేశ్వరస్వామి, చెంచమరెడ్డిగారి పల్లె రామాలయం, చిచ్చిలివారిపల్లె పంచాయతీ రావిళ్లవారి పల్లె రామాలయం తదితర ఆలయాల్లో మొలకలు పెట్టి పూజలు చేశారు.

అభయాంజనేయస్వామికి విశేషపూజలు



కల్లూరు, మే 23: పులిచెర్ల మండలం రాజుల పల్లి పంచాయతీ పెద్ద ఎస్సీ కాలనీలో కొలువైన అభయాంజ నేయ స్వామి ఆలయంలో గురువారం మొలకల పౌర్ణమి సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. ఆలయంలో ఉదయం స్వామి వారికి అభిషేకాలు, అర్చ నలు, విశేష పూజలు చేశారు. విశేషాలంకరణలో స్వామి వారు భక్తులకు ప్రత్యేకంగా దర్శనమిచ్చారు. ఆలయానికి విచ్చే సిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఉభయ దారులుగా ఆలయ ధర్మకర్త సుందరయ్య కుటుంబ సభ్యులు వ్యవహరించారు.

శాస్త్రోక్తంగా ధ్వజారోహణం



సోమల, మే 23: సోమల మండలం భారతంమిట్టలోని పంచపాండవ ఆలయం వద్ద గురువారం మహాభారత యజ్ఞం ప్రారంభం సందర్భంగా ధ్వజారోహణ కార్యక్రమం శాస్త్రోక్తంగా జరిపారు. సర్పయాగం, వ్యాస జననం కార్యక్రమాలు నిర్వహించారు. ఉభయదారులుగా మనోహర్ కుటుంబ సభ్యులు వ్యవహరించారు. సోమల, ఇరికిపెంట, దాసరివారిపల్లె, గన్నావారిపల్లె, భారతంమిట్ట, వడ్డిపల్లె, పాయలవారిపల్లె, రాశెట్టివారిపల్లె భక్తులు పాల్గొన్నారు.

రైలుబండి కోసం..!

- 'జాతర' జనంతో కిటకిటలాడిన రైల్వే స్టేషన్



రైల్వే స్టేషన్‌లో గురువారం ఉదయం రైళ్లకోసం వేచివున్న జనం

కుప్పం, మే 23: వారం రోజుల జాతర మహోత్సవం ప్రధాన ఘట్టాలైన గంగమాంబ శిరస్సు ఊరేగింపు, విశ్వరూప దర్శనాలు మంగళ, బుధవారాలలో ముగిశాయి. దీంతో బుధవారం రాత్రి, గురువారం తెల్లవారుజామున తిరుగు ప్రయాణమైన జనంతో కుప్పం రైల్వే స్టేషన్ కిటకిటలాడింది. రైళ్లకోసం గంటల తరబడి పడిగాపులు కాయాల్సి వచ్చింది.

కుప్పంలో వెలసిన ప్రసన్న తిరుపతి గంగమాంబ జాతర మహోత్సవాలు ఈనెల 15వ తేదీన వినాయక ఉత్సవంతో ప్రారంభమయ్యాయి. ప్రధాన ఘట్టాలపై వాహన సేవలకు అంతగా లేదు కానీ, అగ్నిగుండ మహోత్సవం జరిగిన ఈ నెల 20వ తేదీ ఉదయం నుంచి భక్తులు కుప్పానికి పోటెత్తడం ప్రారంభించారు. ఒక్క ఆంధ్రా నుంచే కాదు, పొరుగున ఉన్న తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి వేలాదిగా జనం కుప్పానికి తరలి వచ్చారు. ఈ నెల 20వ తేదీ ఉదయం నుంచి మొదలైన జనం రాక, అమ్మవారి విశ్వరూప దర్శనం రోజైన 22వ తేదీదాకా సాగుతూనే ఉంది. మధ్యలో 21వ తేదీన అమ్మవారి శిరస్సు ఊరేగింపు అంగరంగ వైభవంగా జరిగింది. ఆ తర్వాతి రోజైన బుధ వారం విశ్వ రూపంతో గంగమాంబ అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చింది. ఈ మూడు రోజులపాటు కుప్పం ఇతర ప్రాంతాలనుంచి తరలివచ్చిన భక్తజనాలతో కిటకిటలాడింది. వీరంతా అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నాక తిరుగు ప్రయాణాలు పెట్టుకున్నారు. బుధవారం సాయంత్రం నుంచి ఈ ప్రయాణాలు ప్రారంభమయ్యాయి. బస్సులు ఇతర వాహనాలకంటే రైళ్లను కుప్పం వచ్చే జనం ఆశ్రయిస్తారు. పొరుగున ఉన్న రాష్ట్రాలకు వెళ్లాలంటే రైళ్లకు మించిన ప్రయాణ సాధనం లేదు వారికి. అందుకనే తిరుగు ప్రయాణమైన వారితో బుధవారం రాత్రి నుంచి గురువారం మధ్యాహ్నం దాకా కుప్పం రైల్వే స్టేషన్ పట్టలేని జనంతో నిండిపోయింది. జనం రెండు రైల్వే ప్లాట్‌ఫామ్ పొడవునా కనిపించారు. చెన్నై, తిరుపతిల వైపు వెళ్లేవారు మొదటి ప్లాట్‌ఫామ్‌పై ఉంటే, బెంగళూరు వైపు ప్రయాణించే వారు రెండవ ప్లాట్‌ఫామ్‌పై బారులు తీరారు. రైలు స్టేషన్‌లో ఆగీఆగకముందే ఒకరిని ఒకరు తోసుకుంటూ ఎక్కడానికి పోటీ పడ్డారు. పిల్లాపాపలు, వృద్ధులు చాలా అవస్థలు పడ్డారు. గురువారం సాయంత్రానికి జాతరకోసం కుప్పం వచ్చిన ఇతర ప్రాంతాల జనమంతా దాదాపు తరలివెళ్లిపోయారు. కుప్పం రైల్వే స్టేషన్ అంతమందినీ ఆయా ప్రాంతాలకు చేర్చడంలో చెమటోడ్చింది. జాతర సందర్భంగా మరిన్ని అదనపు రైళ్లకు కుప్పంలో స్టాపింగ్ ఇచ్చివుంటే ఈ రద్దీ బాధ తప్పేదని స్థానికులతోపాటు కుప్పం వచ్చిన భక్తజనం వాపోయారు.

పలమనేరు గంగమ్మ ఆలయ హుండీ లెక్కింపు



హుండీ ఆదాయాన్ని లెక్కింపు చేయిస్తున్న ఈవో కమలాకరరావు

పలమనేరు, మే23 : పలమనేరులో గురు వారం గంగమ్మ గుడిలో హుండీ ఆదాయాన్ని లెక్కించారు. ఈనెల 20, 21, 22 తేదీల్లో గంగ మ్మ జాతర వైభవంగా నిర్వహించారు. జాతర సందర్భంగా ఎండో మెంట్ అధికారులు గంగమ్మ గుడిలో ప్రత్యేక హుండీ ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో హుండీ ఆదాయాన్ని ఈవో కమలాకర రావు లెక్కింపు చేయించారు. భక్తులు రూ.8,38, 374 లను అమ్మవారికి మొక్కుబడులు, కానుకల రూపంలో చెల్లించారు. కాగా గత ఏడాది కంటే ఈ సంవత్సరం రూ.31,828లు అదనపు కానుకలు వచ్చాయని ఈవో వెల్లడించారు.

దేవాదాయశాఖే జాతర నిర్వహించాలి : ఈ సారి గంగమ్మ ఆలయానికి పాలకవర్గం లేకపోవడంతో ఎండోమెంట్ అధికారులే జాతర నిర్వహించారు. ఎటువంటి రాజకీయ జోక్యం లేకుండా సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు జాతర నిర్వహించారు. పాలకవర్గాల హయాంలో జాతర పేరుతో కొందరు చేసే వసూళ్ల పలు విమర్శలకు దారితీసేవి. ఇక వీఐపీ పేరుతో ఇచ్చే పాసులు వల్ల సామాన్య భక్తులు ఇబ్బంది పడేవారు. వేల సంఖ్యలో వీఐపీ ఉచిత పాసులు ముద్రించి తమకు కావాల్సిన వారికి పంచుకొనే వారు. ఈసారి వీఐపీ పాసులు లేకుండా ఈఓ చర్యలు తీసుకోవడంతో అమ్మవారి ముందు అందరూ సామాన్యులవలే దర్శనం చేసుకున్నారు. దీంతో ఏటా ఇలాగే దేవాదాయశాఖ ఆధ్వర్యంలోనే జాతర చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో మేస్త్రీకి తీవ్ర గాయాలు



చికిత్స పొందుతున్న యోగానంద

పుంగనూరు రూరల్, మే23: పుంగనూరు- కత్తార్లపల్లె మార్గంలో ద్విచక్రవాహనం బోల్తాపడి ఓ మేస్త్రీ తీవ్ర గాయాలపాలయ్యాడు. ఈ ఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. చౌడేపల్లె మండలం 29ఏ చింతమాకులపల్లె పంచాయతీ బి.కదిరేపల్లెకు చెందిన కేశవులు కుమారుడు యోగానంద(33) మేస్త్రీ పనులు చేస్తుండేవాడు. కర్ణాటక సరిహద్దు ప్రాంతమైన కత్తార్లపల్లె సమీపంలోని మద్యం సేవించి ద్విచక్రవాహనంలో తిరుగు ప్రయాణమయ్యాడు. మార్గమధ్యం లో ద్విచక్ర వాహనం అదుపు తప్పి బోల్తాపడింది. గాయపడి రోడ్డు పక్కన పడి ఉన్న అతడిని ప్రయాణికులు గమనించి 108కు సమాచారం అందించారు. తర్వాత 108 సిబ్బంది వచ్చి అతడిని పుంగనూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

ఆలయాల్లో ఘనంగా పౌర్ణమి పూజలు





కుప్పనపల్లెలో కాళభైరేశ్వరుడికి పూజలు, బైరెడ్డిపల్లెలో విశేషాలంకరణలో శేషాద్రిస్వామి

బైరెడ్డిపల్లె, మే 23 : బైరెడ్డిపల్లెలోని శేషాద్రిస్వామి ఆలయంలో గురువారం పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు శ్రీదేవి, భూదేవి సమేత శేషాద్రి స్వామివారికి విశేషాలంకరణచేసి పూజలు జరిపారు. పలువురు భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. నిర్వాహకులు ధనంజయగౌడు ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ● మండలంలోని కుప్పనపల్లె గ్రామసమీపంలో కొలువైన కాళభైరేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు మురళీధర చార్యులు స్వామివారికి విశేషపూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్య క్రమానికి జయసుధ, విజయకుమార్, కృష్ణప్పగౌడు, బైరప్పగౌడు, సంపంగి, నందీష్ ఉభయదారులుగా వ్యవహరించారు.

అంగరంగ వైభవంగా కల్యాణవెంకన్న రథోత్సవం



బైరెడ్డిపల్లె, మే 23 : మండలంలోని పట్నపల్లె కల్యాణ వెంకటరమణస్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రథోత్సవం వైభవంగా జరిగింది. వివిధ రకాల పుష్పాలతో శోభాయమానంగా అలంకరించిన రథంపై శ్రీదేవి,భూదేవి సమేత కల్యాణ వెంకన్న ఉత్సవమూర్తులను విశేషాలంకరణగావించి కొలువు దీర్చారు. ఆలయ అర్చకులు మురళీకృష్ణాచార్యులు రథాంగహోమం, ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం గోవింద నామస్మరణల మధ్య భక్తులు రథాన్ని లాగారు. అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు నిర్వాహకులు ప్రసాదాలు, మజ్జిగ, పెసలుపప్పు, పానకం పంపిణీ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రేపు ఉచిత కంటి వైద్యశిబిరం

పుంగనూరు రూరల్, మే23: ఈనెల 25న పుంగనూరు విశ్రాంత ఉద్యోగుల భవన్ ఆవరణలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు విశ్రాంత ఉద్యోగ సంఘ నాయకులు తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ చెన్నైకి చెందిన శంకర్ నేత్రాలయ హాస్పిటల్ వైద్యుల ఆధ్వర్యంలో ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామన్నారు. భోజన వసతి సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు మునిస్వామి మొదలియార్, నాగరాజ, దిలీప్‌కుమార్, శ్రీనివాస్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగ విత్తనకాయల పంపిణీ





పుంగనూరు మమండలఉలవలదిన్నెలో పడిగాపులు కాస్తున్న రైతులు, శాంతిపురం విత్తనకాయల పంపిణీ చేస్తున్న ఏవో అప్పోజి

కల్లూరు, మే 23: రైతులకు సబ్సిడీ ధరలతో అందజేస్తున్న వేరుశనగ విత్తనకాయలు పక్కదారి పడితే సహించేదిలేదని మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్ హెచ్చరించారు. పులిచెర్ల మండలంలోని 13 ఆర్బీకేల్లో గురువారం రైతులకు వేరుశనగ విత్తనకాయల పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ విత్తనకాయలు పొందిన రైతులు తప్పనిసరిగా పంటసాగు చేయాలన్నారు.

సోమల: సోమల రైతు భరోసా కేంద్రంలో గురువారం వేరుశనగ విత్తనకాయలను సబ్సిడీ ధరకు రూ.1720కి అందజేశారు. పుంగనూరు ఏడీఏ శివకుమార్ పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ఆయన వెంట ఏవో సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

రొంపిచెర్ల: మండలంలోని అన్ని ఆర్బీకేల్లో రైతులకు వేరుశనగ కాయలు పంపిణీ చేసినట్లు వ్యవసాయాధికారి శ్రీనివాస్ తెలిపారు. రాయితీ పోను రూ.1710తో రైతులకు పంపిణీ చేస్తున్నామన్నారు. గతంలో విత్తనశుద్ధి కోసం ఉచితం ట్రైకోడెర్మావినిడి మందు ఇచ్చేవారు. ప్రస్తుతం అది ఇవ్వడం లేదని రైతులు తెలియజేశారు.

బైరెడ్డిపల్లె: మండలంలో వేరుశనగ విత్తనకాయల పంపిణీని తహసీల్దార్ స్వర్ణలత, ఎంపీడీవో రాజేష్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయాధికారి గీత, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

గుడుపల్లె: మండలంలోని రైతు భరోసా కేంద్రాల్లో వేరుశనగ విత్తనకాయలు పంపిణీ చేసినట్లు ఏవో నాగరాజు తెలిపారు.

శాంతిపురం: శాంతిపురం మండలంలో రైతులకు వ్యవసాయ అధికారి అప్పోజి గురువారం సొన్నేగానిపల్లె, కొలమడుగు, దండికుప్పం, ఎంకేపురం, మఠం, శివరామపురం రైతు భరోసా కేంద్రాల్లో సుమారు 1,268 మంది రైతులకు 458 క్వింటాళ్ల రాయితీ వేరుశెనగ విత్తనకాయలు పంపిణీ చేశారు.

రామకుప్పం: తహసీల్దారు శ్రీధర్, ఎంపీడీవో ఈశ్వరన్ రామకుప్పం గ్రామసచివాలయంలో రైతులకు సబ్సిడీ వేరుశెనగ విత్తనకాయల పంపిణీని ప్రాంభించారు. మండలానికి మొత్తం 5144 బస్తాల వేరుశనగ విత్తనకాయలు వచ్చాయని ఏవో అమృత తెలిపారు. రామకుప్పం, మణీంద్రం, బైపరెడ్లపల్లె, కెంచనబల్ల, వీర్నమల, బల్ల, సింగసముద్రం, ఆనిగానూరు, బందార్లపల్లె పంపిణీ కేంద్రాల్లో రైతులకు 2608 బస్తాలను పంపిణీ చేసినట్టు ఆమె వివరించారు.

పుంగనూరు: మండలంలోని రైతులకు 600 క్వింటాళ్ల వేరుశనగ విత్తన కాయలు పంపిణీ చేసినట్లు వ్యవసాయాధికారి రాజేశ్ తెలిపారు. కాగా రైతులు ఉదయం 9.30గంటలకే ఆర్బీకేల వద్దకు చేరుకుని పడిగాపులు కాశారు. అధికారులు మాత్రం 10.30గంటలకు వచ్చారు. ఇక రైతులు ఎండకు క్యూలైన్లలో నిలబడలేక ఇబ్బందులు పడ్డారు.

భీమగానిపల్లెలో పడకేసిన పారిశుధ్యం

- తాగునీటి బోరు వద్ద లీక్ అవుతున్న నీరు
- పట్టించుకోని పంచాయతీ అధికారులు

పుంగనూరు రూరల్, మే23: మండలంలోని భీమగానిపల్లెలో పారిశుధ్యం లోపించింది. మురుగునీరు వీధుల్లో ప్రవహిస్తూ దోమలకు నిలయంగా మారింది. గ్రామానికి తాగునీటి అవసరాల కోసం ఏర్పాటు చేసిన బోరుమోటారు వద్ద నీరు లీకవుతూ పైపులైన్‌లో చేరుతోంది. అలాగే బోరు మోటారు సమీపంలోనే పేడ దిబ్బలు ఉండడం, వర్షం వస్తే దిబ్బల్లో నిల్వ ఉన్న నీరు వీధుల్లో ప్రవహించే నీరు తాగునీటి పైపులో కలిసిపోతోంది. అదే నీరు వీధి కొళాయిలద్వారా జనం తాగాల్సిన పరిస్థితి ఉంది. ఫలితంగా అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని పంచాయతీ, సచివాలయ సిబ్బంది, ప్రజా ప్రతినిధులకు తెలియజేసినా ఫలితం లేదని విచారం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.







వీధుల్లో ప్రవహిస్తున్న మురుగునీరు, తాగునీటిబోరు వద్ద లీక్ అవుతున్న నీరు, బోరుమోటర్ సమీపంలో నిల్వ నిలచిన పేడదిబ్బమురుగునీరు

చిత్తూరు

జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

కలగా లోలెవెల్ బ్రిడ్జి నిర్మాణం

- నీవానది ప్రవాహం సాగితే 8 పంచాయతీల ప్రజలకు అవస్థలే
- హామీ ఇచ్చి నెరవేర్చని డిప్యూటీ సీఎం
- గతేడాది వర్షాలు కొట్టుకుపోయిన తాత్కాలిక రోడ్డు



తెగిపోయిన రోడ్డును పరిశీలిస్తున్న రిటైర్డు ఈఈ సత్యనారాయణరెడ్డి (ఫైల్ ఫొటో)



నీవానదిలో ప్రయాణిస్తున్న కారు

గంగాధరనెల్లూరు, మే 23: మండలంలోని కలిజవేడు-కొత్రకోన పంచాయతీల మధ్య, ఆత్మకూరు-నరసింగరాయనిపేట(చిత్తూరు మండలం) పంచాయతీల మధ్య ఉన్న నీవానదిలో లోలెవల్ బ్రిడ్జి నిర్మాణం కలగానే మిగిలిపోయింది. వర్షాలు కురిసిన ప్రతిసారీ నదిలో ప్రవాహం సాగిందంటే ఎనిమిది పంచాయతీలకు చెందిన ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. కలిజవేడు, నందనూరు, పాపిరెడ్డిపల్లె పంచాయతీలకు చెందిన ప్రజలు, రైతులు, విద్యార్థులు జిల్లా కేంద్రమైన చిత్తూరుకు వెళ్లాలంటే కలిజవేడు గ్రామం మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. నదిలో ప్రవాహం సాగిన సమయంలో 10 కిలోమీటర్ల దూరం చుట్టాల్సి వస్తోంది. ఒక్కొక్క పంచాయతీ వారికి ఒక్కొక్క రకంగా 15 నుంచి 18 కిలోమీటర్ల దూరం వెళ్లాల్సిన పరిస్థితి. కొత్రకోన పంచాయతీ ప్రజలు కలిజవేడు, నందనూరు, పాపిరెడ్డిపల్లె పంచాయతీలతోపాటు పెనుమూరు మండలానికి వెళ్లాలంటే అరకిలోమీటరు దూరం ఏటి ప్రాంతంలో ప్రయాణం సాగిస్తే చాలు. నదిలో నీరు వస్తే చిత్తూరు సరిహద్దు దొడ్డిపల్లెకు వెళ్లి అక్కడి నుంచి పెనుమూరు మండలం కలవకుంట దాటుకుని గంగాధరనెల్లూరు మండలంలోని పంచాయతీలకు వెళ్లాలంటే 15 నుంచి 17 కిలోమీటర్ల దూరం ప్రయాణం సాగించాల్సి ఉంది. మండలంలోని ఆత్మకూరు దళితవాడ సమీపం నుంచి నరసింగరాయనిపేట(చిత్తూరు మండలం పరిధిలోని)కు అర కిలోమీటరు దూరంలోనే ఉంది. వర్షా కాలంలో ఇక్కడ కూడా రాకపోకలు స్తంభిస్తున్నాయి. ఆత్మకూరు, కడపగుంట, ఎల్లాపల్లె పంచాయతీలకు చెందిన ప్రజలూ ఇదేవిధంగా ఇబ్బంది పడుతున్నారు. నరసింగరాయనిపేట, కుర్చివేడు, ముట్టుకూరు పంచాయతీల ప్రజలు గంగాధనెల్లూరు మండలానికి రావాలన్నా ఇబ్బందులు తప్పడం లేదు.

హామీ ఇచ్చి పట్టించుకోని డిప్యూటీ సీఎం..

గత ఎన్నికలకు ముందు ప్రచారానికి వచ్చిన ఎమ్మెల్యే నారాయణస్వామికి మండల ప్రజలు ఈ సమస్యను విన్నవించారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే తప్పనిసరిగా బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. వైసీపీ ప్రభుత్వం రావడం, నారాయణస్వామి ఎమ్మెల్యేగా గెలిచి డిప్యూటీ సీఎం కావడం జరిగాయి. ఎన్నికల హామీ గురించి గుర్తు చేయడంతో నాలుగున్నరేళ్ల క్రితం సంబంధిత అధికారులతో చర్చించి నివేదికలు అందజేయాలని ఆదేశించారు అమరావతి నుంచి రిటైర్డు బ్రిడ్జిస్ డిజైన్ ఈఈ సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో కలిజవేడు-కొత్రకోన, ఆత్మకూరు-నరసింగరాయనిపేట వద్ద బ్రిడ్జి నిర్మాణానికి గాను కొలతలు వేసి, ఒక్కొక్క ప్రాంతంలో రూ.10 నుంచి 12 కోట్లకు పైగా నిధులు కావాల్సి వస్తుందని అంచనా వేశారు. ఇప్పటికీ ఆ ప్రతిపాదనలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందంగా మారాయి.

డిప్యూటీ ఈవో నియామకాలకు రేపు చిత్తూరులో స్క్రీనింగ్ పరీక్షలు

చిత్తూరు కలెక్టరేట్, మే 23: ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో డిప్యూటీ ఎడ్యుకేషనల్ అధికారుల నియామకం కోసం శనివారం ఆబ్జెక్టివ్ తరహాలో కంప్యూటర్ బేస్డ్ స్క్రీనింగ్ పరీక్షలు చిత్తూరులో నిర్వహించనున్నట్లు కలెక్టర్ షన్మోహన్ తెలిపారు. సీతమ్స్ కళాశాల, వేము ఇంజనీరింగ్ కళాశాల, మదర్ థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలను పరీక్ష కేంద్రాలుగా ఎంపిక చేశామని పేర్కొన్నారు. 730 మంది అభ్యర్థులు హాజరవుతున్నట్లు వివరించారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 11.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందని, అభ్యర్థులను 7 నుంచి 8.30 గంటల మధ్య కేంద్రాల్లోకి అనుమతిస్తామని, నిమిషం ఆలస్యమైన అనుమతించేది లేదని ఒక ప్రకటనలో తెలిపారు.

వరసిద్ధుడి సేవలో సమాచార హక్కు కమిషనర్



కమిషనర్‌కు జ్ఞాపిక అందిస్తున్న ఏఈవో

ఐరాల(కాణిపాకం), మే 23: రాష్ట్ర సమాచార శాఖ హక్కు కమిషనర్ హరిప్రసాదరెడ్డి శుక్రవారం కాణిపాక వరసిద్ధుడిని దర్శించుకున్నారు. ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి ఆయనకు స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదాశీర్వాద మడపంలో ఆశీర్వదించి స్వామి శేషవస్త్రాలు, తీర్థప్రసాదాలు, జ్ఞాపిక అందించారు. సూపరింటెండెంట్ కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్ రమేష్ పాల్గొన్నారు.

వైభవంగా పౌర్ణమి వేడుకలు



ఆలయంలో హోమం నిర్వహిస్తున్న అర్చకులు

పాలసముద్రం, మే 23: మండలంలోని పాతపాళ్యం గ్రామంలో వెలసిన బాలగురునాదీశ్వర ఆలయంలో గురువారం పౌర్ణమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో అర్చకులు హోమగుండం ఏర్పాటు చేసి, కలశాలు పెట్టి ఉత్తరాభిషేకం నిర్వహించారు. మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

అర్ధగిరిలో ప్రత్యేక పూజలు



తవణంపల్లె, మే 23: అర్ధగిరి వీరాంజనేయస్వామి ఆలయంలో గురువారం పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు వేణుగోపాలాచార్యుల ఆధ్వర్యంలో ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, సుదర్శన హోమం నిర్వహించారు. సాయంత్రం స్వామి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి, మేళతాళాల నడుమ ప్రాకారోత్సవం నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు, అన్నదానం ఏర్పాటు చేశారు.

వేలంతో రూ.5.50 లక్షల ఆదాయం



వేలం నిర్వహిస్తున్న సిబ్బంది

తవణంపల్లె, మే 23: అర్ధగిరి వీరాంజనేయస్వామి ఆలయంలో గురువారం తలనీలాలు, కొబ్బరి చిప్పల సేకరణ కోసం బహిరంగ వేలం నిర్వహించారు. సంవత్సర కాలం తలనీలాల సేకరణ కోసం తమిళనాడు రాష్ట్రం గుడియాత్తంకు చెందిన యోగానందం రూ.4,55,000కు పాడుకున్నారు. కొబ్బరి చిప్పల సేకరణ కోసం పత్రపల్లెకు చెందిన నాగమ్మ రూ.లక్షకు పాడుకుంది. ఈవో హనుమంతరావు, ఇన్‌స్పెక్టర్ సుమనప్రియ పాల్గొన్నారు.

గంగమ్మ సేవలో భానుప్రకాష్



కృష్ణరామాపురంలో గంగమ్మను దర్శించుకుంటున్న భానుప్రకాష్

నగరి, మే23: మండలంలోని కృష్ణరామాపురంలో గురువారం నిర్వహించిన గంగజాతరలో గాలి భానుప్రకాష్ పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. గ్రామస్తులు ఆయన్ను సన్మానించారు. అనంతరం పట్టణ పరిధిలోని కేవీపీఆర్‌పేటలో ఆయన పర్యటించి, స్థానికులతో పలు విషయాలపై చర్చించారు. నాయకులు బాలాజీ, శ్రీనివాసులురెడ్డి, జవహర్‌రెడ్డి, ఉదయ్, నరసింహులు పాల్గొన్నారు.

చిల్లర దుకాణాల్లో పెట్రోల్ బాటిళ్ల స్వాధీనం



నగరి, మే23: చిల్లర దుకాణాల్లో బాటిళ్లలో పెట్రోల్ విక్రయాలను గురువారం అధికారులు అడ్డుకున్నారు. మున్సిపల్ కమిషనర్ మంజునాథగౌడ్ ఆధ్వర్యంలో కరకంతాపురం, సత్రవాడలోని పలు దుకాణాల్లో బాటిళ్లలో ఉన్న పెట్రోల్‌ను స్వాధీనం చేసుకున్నారు. కౌంటింగ్ పూర్తయ్యే వరకు పెట్రోల్, డీజిల్ విక్రయించరాదని, అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఘనంగా గంగజాతర



నింద్ర, మే 23: మండలంలోని ఎలకాటూరులో గంగ జాతర ఘనంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారికి నైవేద్యం సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. నడివీధిలో ప్రతిష్ఠించారు. భక్తుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. సాయంత్రం అమ్మవారిని గ్రామ పొలిమేరల్లో నిమజ్జనం చేశారు.

పండ్లు, పూల తోటల పెంపకానికి దరఖాస్తులు

వెదురుకుప్పం, మే 23: పండ్ల, పూల తోటల పెంపకంపై ఆసక్తి ఉన్న రైతులు ఉపాధి హామీ పథకంలో దరఖాస్తు చేసుకోవాలని ఏపీవో ఇందు గురువారం తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఉపాధి హామీ కార్యాలయం లేదా ఆయా గ్రామ పంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్ల వద్ద చేర్చాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు ఉపాధి హామీ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

వైభవంగా పౌర్ణమి పూజలు



వెదురుకుప్పం, మే 26: మండలంలోని చవటగుంటలో ఉన్న ఆవుదేవర నందీశ్వర స్వామి ఆలయంలో గురువారం పౌర్ణమి పూజలు నిర్వహించారు. అఖండ దీపం వెలిగించి, విఘ్నేశ్వర పూజ, రుద్రాభిషేకం చేశారు. స్వామిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తులకు అన్నదానం చేశారు.

నేటి నుంచి క్రైస్తవ కూటములు

గుడిపాల, మే 23: మండలంలోని సియోన్‌మలై చర్చిలో శుక్రవారం నుంచి ఈ నెల 26వ తేదీ వరకు క్రైస్తవ కూటములను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వేలూరు డయాసిస్ బిషప్ శర్మ నిత్యానందం ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ కూటముల్లో నాటకాలు, అన్నదానం ఉంటాయని చర్చి ప్రధాన కార్యదర్శి కరుణాస్ జాన్, బోధకుడు పాల్సన్, కోశాధికారి ధనరాజ్ తెలిపారు.

నేడు పుష్పపల్లకి సేవ

చిత్తూరు కల్చరల్, మే 23: గిరింపేట దుర్గాంబ ఆలయం ఆధ్వర్యంలో అమ్మవారికి శుక్రవారం రాత్రి పుష్పపల్లకి సేవ నిర్వహిస్తున్నట్లు ఈవో మునిశేఖర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అమ్మవారికి 1,008 బిందెల పవిత్ర జలంతో అభిషేకం, దీపారాధన ఉంటాయని పేర్కొన్నారు. అనంతరం అమ్మవారిని పసుపు అలంకారంలో భక్తులకు దర్శనం కల్పించనున్నట్లు తెలిపారు. రాత్రికి అమ్మవారిని పుష్పరథంపై ఊరేగించనున్నట్లు వెల్లడించారు. గిరింపేట బొందు వీధి శ్రీవెంకటేశ్వరాలయంలో శుక్రవారం ఉదయం కల్యాణోత్సవం నిర్వహించనున్నామని ఆలయ ధర్మకర్త సెంథిల్ తెలిపారు.

విద్యార్థులకు చిత్రలేఖనంపై శిక్షణ



కార్వేటినగరం, మే 23: వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా స్థానిక ప్రభుత్వ గ్రంథాలయంలో గురువారం విద్యార్థులకు చిత్రలేఖనంపై శిక్షణ ఇచ్చారు. విశ్రాంత డ్రాయింగ్ మాస్టర్ సుబ్రమణ్యం బొమ్మలు గీయడంలో మెలకువలు నేర్పించారు. గ్రంథాలయాధికారి శంకరబాబు పాల్గొన్నారు.

టీకేఎం పేట హైస్కూల్లో అన్ని సమస్యలే!



అసంపూర్తిగా ఉన్న అదనపు గదుల నిర్మాణం

కార్వేటినగరం, మే 23: స్థానిక టీకేఎం పేట పాఠశాలలో సమస్యలు కొలువుదీరి ఉన్నాయి. నాడు-నేడు పథకం కింద చేపట్టిన అదనపు తరగతి గదుల నిర్మాణం అసంపూర్తిగా ఉంది. ఉన్న గదులు సరిపోక చెట్ల కిందనే పాఠాలు బోధించాల్సిన పరిస్థితి ఉంది. మరుగుదొడ్ల నిర్మాణమూ అలాగే ఉంది. మరో 20 రోజుల్లో పాఠశాలలు పునః ప్రారంభం కానున్నా అధికారులు వాటిపై దృష్టి సారించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

శాస్త్రోక్తంగా శయనోత్సవం

చౌడేపల్లె, మే23: స్థానిక బజారు వీధిలో వెలసిన అభీష్టద మృత్యుంజయేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో 11వ రోజు ఆది దంపతులకు శాస్త్రోక్తంగా ప్రథమ శయనోత్సవం నిర్వహించారు. గురువారం ఉదయం స్వామివారికి ఆలయ ప్రధానార్చకులు రాజశేఖర్ దీక్షితులు, కుమార, మహేష్ దీక్షితులు పంచామృతాభిషేకాలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. రాత్రి ఆలయంలో ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి పట్టుపాన్పుపై శాస్త్రోక్తంగా శయనోత్సవం జరిపించారు.

రాష్ట్రంలో ఆటవిక రాజ్యం : టీడీపీ



సమావేశంలో మాట్లాడుతున్న సురేంద్ర కుమార్

చిత్తూరు సిటీ, మే 23: రాష్ట్రంలో ఆటవిక రాజ్యం సాగుతోందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్ర కుమార్ విమర్శించారు. గురువారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు పక్కా ప్రణాళికతో టీడీపీ నేతలు, కార్యకర్తలు, సానుభూతి పరులపై దాడులకు పాల్పడుతున్నారన్నారు. ఎన్నికల నియమావళి అమలులో ఉన్నా కొంత మంది పోలీసు అధికారులు వైసీపీకి అనుకూలంగా వ్యవహరించడం దురదృష్టకరమని చెప్పారు. పలువురు రిటర్నింగ్ అధికారులు వైసీపీ ప్రజాప్రతినిధుల బెదిరింపులు తట్టుకోలేక మెడికల్ లీవు కోసం ఈసీకి వినతులు చేస్తున్నారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతోందన్నారు. మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఈవీఎంలను ధ్వంసం చేయడమేగాక ఓటర్లను భయభ్రాంతులకు గురిచేశారన్నారు. ఆయన్ను పోలీసులు అరెస్టు చేయకపోవడం శోచనీయమన్నారు. ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్, నేతలు నేతలు జాఫర్, ధరణి, కుమార్ యాదవ్ పాల్గొన్నారు.

వైభవంగా కంచి గరుడసేవ



గరుడ వాహనంపై ఊరేగుతున్న స్వామి - పాల్గొన్న భక్తులు

నగరి, మే23: పట్టణంలోని పెరుమాల్ గుడి వీధిలో గురువారం కంచి గరుడసేవ అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం 6.30 గంటలకు కరకంతేశ్వరస్వామి గరుడ వాహనంపై మాడవీధులలో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. కోలాటాలు, భజనబృందాలు వెంట రాగా స్వామి ఊరేగింపు సాగింది. కళాకారులకు, భక్తులకు చల్లని పానీయాలు అందజేశారు. ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ విద్యార్థులు భక్తులకు సేవలు అందించారు. ఆలయ డిప్యూటీ ఈవో నాగరత్నం, ఏఈవో పార్థసారథి, సూపరింటెండెంట్ సోమశేఖర్, వెంకటరమణ, గుణశేఖర్, జానకీరామ్, అర్చకులు నరసింహప్రసాద్, ధన్వంతరి బాలాజీ పాల్గొన్నారు.

అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ వేసుకోవాలి



వ్యాక్సిన్ వేస్తున్న డీఎంహెచ్‌వో ప్రభావతిదేవి

చిత్తూరు రూరల్, మే 23: అర్హులైన ప్రతి ఒక్కరూ అడల్ట్ బీసీజీ వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించుకోవాలని, తద్వారా టీబీ వ్యాధికి చెక్ పెట్టవచ్చునని చిత్తూరు డీఎంహెచ్‌వో ప్రభావతిదేవి అన్నారు. నగరంలోని ప్రశాంత్ నగర్ యూపీహెచ్‌సీలో నిర్వహిస్తున్న అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడున్న మహిళలకు వ్యాక్సిన్ వేశారు. 18 సంవత్సరాలు పైబడిన, షుగర్ వ్యాధిగ్రస్తులు ఈ వ్యాధి వేయించుకోవాలన్నారు. టీబీ వ్యాధిగ్రస్తులు ఉన్న ఇళ్లలో వారికి తప్పక వ్యాక్సిన్ వేయాలన్నారు. ఇంటింటి సర్వే చేయాలని వైద్యాధికారులను ఆదేశించారు.

శాస్త్రోక్తంగా మహాభారతం స్వీకారం కొడి



స్వీకారం కొడి కార్యక్రమంలో కార్యనిర్వాహకులు

వెదురుకుప్పం, మే 23: మండలంలోని పచ్చికాపల్లం మహాభారత ఉత్సవాలకు గురువారం స్వీకారం కొడి కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీకృష్ణ ద్రౌపదీ సమేత ధర్మరాజుల దేవస్థానంలోని ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. స్వీకారం కొడితో ఉత్సవమూర్తులను ఆలయానికి సంబంధించిన గ్రామాల్లో ఊరేగిస్తామని కార్యనిర్వాహకులు తెలిపారు. పగలు హరికథ, రాత్రి వీధి నాటకాలు ఉంటాయని, ఉత్సవ తేదీలను త్వరలోనే ప్రకటిస్తామని వివరించారు.

ఘనంగా పౌర్ణమి పల్లకి సేవ



పల్లకి సేవ నిర్వహిస్తున్న భక్తులు

చిత్తూరు కల్చరల్, మే 23: వైశాఖమాసం పౌర్ణమిని పురస్కరించుకుని గురువారం సాయంత్రం గిరింపేట సత్యసాయి సంస్థాన్ ఆధ్వర్యంలో సత్యసాయిబాబాకు పల్లకి సేవ నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహించి, సత్యసాయి సేవా సమితి నిర్వాహకులు స్వామివారి చిత్రపటాన్ని ప్రత్యేక పల్లకిలో ఉంచి, పురవీధులలో ఊరేగించారు. సత్యసాయి భజన మండలి సభ్యులు బాబా కీర్తనలను ఆలపించారు. గిరింపేట మెయిన్ రోడ్డు, సత్యసాయి సేవాసమితి, ఉషానగర్ భజనమండలి సభ్యులు పాదచారులకు మజ్జిగ, నీరు అందజేశారు. సత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మధుసూదనం, నగర కన్వీనర్ ఆర్. శేషనారాయణ, బి.పాండురంగం, శ్రీకంఠయ్య, గజేంద్రరెడ్డి పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాల్లో పికెట్



పెద్దఉప్పరపల్లెలో గ్రామస్తులతో ఎస్ఐ వెంకట నరసింహులు

సోమల, మే 23: మండలంలోని పలు సమస్యాత్మక గ్రామాల్లో పోలీసు పికెటింగ్‌లు ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ వెంకటనరసింహులు తెలిపారు. గురువారం రాత్రి పెద్ద ఉప్పరపల్లె, ఆవులపల్లె, టీ.ఎం గొల్లపల్లె తదితర గ్రామాల్లో గ్రామస్తులతో ఆయన మాట్లాడారు. జూన్ 4న ఓట్ల లెక్కింపు జరుగుతుందని ఆ సమయంలో ఎవరూ ఎలాంటి కవ్వింపు చర్యలు చేయరాదని స్పష్టంచేశారు. గ్రామాల్లో యువకులు బెట్టింగ్‌లు, ఘర్షణలకు దూరంగా ఉండాలని సూచించారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికీ తెలియజేయడం ఏమనగా! నా కక్షిదారు మెస్సర్స్ శ్రీరాం ఫైనాన్స్ లిమిటెడ్, చిత్తూరు బ్రాంచి మేనేజర్ వారు ఇచ్చిన భోగట్టా ప్రకారము ఈ క్రింది కనిన షెడ్యూలు దాఖలా స్థిరాస్తి చిత్తూరు జిల్లా, బుక్కపట్నం వరత్తూరు గ్రామం డో.నెం.4-62లో కాపురముండు ఇ.రవి, తండ్రి ఎల్లయ్య గారికి చెందినదనియు సదరు ఆస్తిని రిజిష్టరు తనఖా చేయించుకొని సదరు ఇ.రవి గారికి ఋణము ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి ఈ క్రింద కనిన షెడ్యూలు దాఖలా ఆస్తిపై ఎటువంటి ఋణములు, చార్జీలు, క్లెయిములు, తనఖాలు, అగ్రిమెంట్లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్న యెడల నేటి నుండి 7 దినములలోగా ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాత పూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి అభ్యంతరములకు నా కక్షిదారు బాధ్యులు కారు.

A. షెడ్యూలు : మన జాయింటు కుటుంబమునకు చెందిన నగదు రూ. 5,00,000-00 అక్షరాల ఐదు లక్షల రూపాయలు నగదు మనలో 1,2,3వ నప్పురులైన టి. నాగమ్మ, టి. రాజేంద్రన్, టి. జయశంకర్ వీర్ల భాగమునకు జాయింటుగా చెంది అనుభవించుకోవలసినది. B. షెడ్యూలు : మన జాయింటు కుటుంబమునకు చెందిన ఆస్తి మతింపు రూ. 35,00,000-00 అక్షరాల ముప్పై ఐదు లక్షల రూపాయలు మతింపు చేయుగల ఆస్తి మనలో 4వ నప్పురైన ఇ.రవి భాగమునకు చెంది అనుభవించుకోవలసిన ఆస్తి వివరం:- చిత్తూరు డి - చిత్తూరు రూరల్ సబ్ డి - చిత్తూరు జిల్లా పరిషత్, గంగాధర నెల్లూరు, మండలం, బుక్కాపట్నం గ్రామ పంచాయితీ, బుక్కాపట్నం గ్రామ లెక్క దాఖలా - బుక్కాపట్నం గ్రామ కంఠం సర్వేనెం.38-12గల భూమిలో యుండు ఆర్‌సిసి మిద్దె యింటికి ఖాళీ జాగాకు చెక్కుబంది కొలతల వివరం తూర్పు : వళ్లియమ్మ గారి ఇల్లు, పడమర : మెలీశ్వరి గారి ఇల్లు, ఉత్తరం : 15 అడుగులు వెడల్పు గల సిసి రోడ్డు, దక్షిణం : చిట్టెమ్మ గారి జాగా. ఈ మధ్య తూర్పు పడమర 36 అడుగులు లేక 10.98 మీటర్లు ఉత్తర దక్షిణం 27 అడుగులు లేక 8.235 మీటర్లు ఈ కొలతలు గల 972 చదరపు అడుగులు లేక 108 చదరపు గజములు గల జాగా పూరా . ఈ జాగాలో తూర్పు పడమర 36 అడుగులు ఉత్తర దక్షిణం 27 అడుగులు మొత్తం 972 చదరపు అడుగులలో నిర్మించియుండు ఆర్.సి.సి. మిద్దె ఇల్లు పూరా, ఈ ఇంటికి అమర్చియుండు తలుపులు, ద్వార బంధనములు, కిటికీలు, పడికట్లు, అడుగు నేల, పైకప్పు కరెంటు సామాగ్రి, కరెంటు సర్వీసు వగైరాలు పూరా

కె.ప్రవీణ్, బి.ఎ.,బి.ఎల్., అడ్వకేట్,
డో.నెం. 10-115, గాంధీ రోడ్ ఎక్స్‌టెన్షన్, చిత్తూరు సెల్ : 9550134756

రైతులకు వేరుశనగ విత్తనాల పంపిణీ ప్రారంభం



చిత్తూరు రూరల్ చెర్లోపల్లిలో విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏవో వేణుగోపాల్

చిత్తూరు రూరల్, మే 23: ఖరీఫ్ సీజన్‌కు గాను చిత్తూరు రూరల్ మండలంలో గురువారం నుంచి సబ్సిడీ వేరుశనగ విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ఏవో వేణుగోపాల్ ప్రారంభించారు. మండలానికి 3,600 బ్యాగులు రాగా, 13 ఆర్బీకేల ద్వారా తొలి రోజు 865 మంది రైతులకు 1,066 బ్యాగులు పంపిణీ చేసినట్లు వివరించారు. మరో మూడు రోజుల్లో పంపిణీ పూర్తి చేస్తామని పేర్కొన్నారు. చెర్లోపల్లి ఆర్బీకేలో ఏవో వేణుగోపాల్ విత్తనాలు పంపిణీ చేశారు.

పాలసముద్రం : మండలంలోని తిరుమలరాజుపురం, నరసింహాపురం రైతు భరోసా కేంద్రాల ద్వారా గురువారం రైతులకు వేరుశనగ విత్తన కాయలు పంపిణీ చేశారు. ఉదయం 8 గంటల నుంచే రైతులు క్యూలో వేచి ఉండి విత్తనాలు తీసుకెళ్లారు. ఒక్కో రైతుకు 30 కేజీల కాయలను పంపిణీ చేసినట్లు ఏవో డిల్లీబాబు తెలిపారు.

శ్రీరంగరాజపురం : రైతులు సబ్సిడీతో వచ్చే వేరుశనగ విత్తనకాయల కోసం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని నగరి వ్యవసాయ శాఖ ఏడీ సౌభాగ్యలక్ష్మి తెలిపారు. గురువారం 49. కొత్తపల్లెమిట్ట రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆమె పరిశీలించారు. 25వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు.

కార్వేటినగరం : కార్వేటినగరం రైతు భరోసా కేంద్రం నుంచి వేరుశనగ విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని మండల వ్యవసాయాధికారిని హేమలత గురువారం ప్రారంభించారు. విత్తనాల బస్తాను 40 శాతం సబ్సిడీతో రైతులకు అందిస్తున్నట్లు ఆమె తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు రైతు భరోసా కేంద్రాల నుంచి పొందవచ్చునని ఆమె సూచించారు.

వెదురుకుప్పం : రైతులకు నలభై శాతం రాయితీతో వేరుశనగ కాయలను పంపిణీ కార్యక్రమాన్ని అన్ని ఆర్బీకే కేంద్రాల్లో గురువారం ప్రారంభించామని వెదురుకుప్పం మండల వ్యవసాయ అధికారిణి సి.వనిత తెలిపారు. రైతు భరోసా కేంద్రాల వద్ద వేరుశనగ కాయలు కావాల్సిన రైతులు తమ వెంట పట్టాదారు పాసుపుస్తకం, ఆధారు కార్డు, ఫోన్ నంబరు తీసుకుని వచ్చారని చెప్పారు. 30 కేజీల బస్తా కె-6 రకం రూ.1710, నారాయణి రకం-రూ.1746కు పంపిణీ చేశామని చెప్పారు. ఆసక్తి ఉన్న రైతులు భరోసా కేంద్రాలకు రావాలని చెప్పారు.



పాలసముద్రం మండలం నరసింహాపురంలో క్యూలో ఉన్న రైతులు